ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 17 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 86

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.128	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 । కనిష్ఠం 16.0



ధనుర్మాసం ఆరంభం

ధనుర్మాస వేడుకలు సోమవారం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. పలు దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు తొలి పాశుర పఠనం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి హారతి నివేదించారు. 7



పరీక్షా సమయం

జిల్లాలో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెండో రోజు సోమవారం 600 కేంద్రాల్లో అధికారులు పరీక్ష నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. 7



ఆందోళనా పథం

సర్వ శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఉద్యోగ భద్రత కల్పించాలని నిర్వహిస్తున్న సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. రోజూ పలు రూపాల్లో వీరు ఆందోళన నిర్వహిస్తున్నారు. సోమవారం చెవిలో పువ్వుతో సమగ్ర శిక్షకులు నిరసన తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

- జిల్లాలో మొత్తం దరఖాస్తులు 4.31లక్షలు
- ఇప్పటి వరకు 40వేల దరఖాస్తుల పరిశీలన
- 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్

పేదలకు సొంతింటి కల నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని శ్రీకారం చుట్టింది. గతంలోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించగా, ప్రత్యేక యాప్‌ను రూపొందించి లబ్ధిదారుల ఎంపికకు సర్వే ప్రారంభించింది. జిల్లాలో మొత్తం 4,31,831మంది దరఖాస్తు చేయగా, ఇప్పటికే 40వేల దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. అందులో 33వేల దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఎప్పటికప్పుడూ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు కలెక్టర్ ఇలాత్రిపాఠి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతీ 500 దరఖాస్తుదారులకు ఒక సర్వేయర్ నియమించారు. ఒక్కో సర్వేయర్ రోజుకు కనీసం 20 దరఖాస్తుల సర్వే పూర్తి చేయాలి. మునిసిపాలిటీల్లో సర్వేయర్‌లుగా వార్డు అధికారి, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ కార్యదర్శి, ఉపాధి సిబ్బందిని నియమించారు. నెలాఖరులోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామాలు, వార్డుల్లో సర్వే సమాచారాన్ని అధికారులు ప్రజలకు ఒక రోజు ముందుగానే ఇస్తారు. అధికారులు వచ్చినప్పుడు దరఖాస్తుదారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పూర్తి వివరాలు అందజేయాలి. ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, సఫాయి కార్మికులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. దరఖాస్తుదారులు ఉంటున్నది సొంత ఇల్లా లేక అద్దె ఇల్లా అనేది మూడు ఫొటోల చొప్పున తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మొదటి విడతలో స్థలం ఉండి ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివాసం ఉంటున్న వారికి మంజూరు చేయనున్నారు. కాగా, 11 నెలల క్రితం దరఖాస్తు చేసుకున్న అర్హులు ఇంటి కోసం ఎదురుచూస్తున్నారు.

యాప్‌లో ఏడు ప్రశ్నలకు వివరాల నమోదు..

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సుమారు ఏడు ప్రశ్నలు ఉన్నాయి.భూమి ఉందా? ఏం చేస్తుంటారు? కుటుంబ సభ్యుల సంఖ్య? వంటి ప్రశ్నలతో పాటు ఇతర వివరాలు అడిగి నమోదు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా క్షేత్రస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి అర్హులను గుర్తిస్తారు. ప్రతీ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గృహనిర్మాణ శాఖను రద్దు చేయగా, ఆశాఖలోని ఉద్యోగులను ఇతర శాఖలకు...

- మిగతా 8వ పేజీలో...



గుడ్డు ప్రియులకు గడ్డుకాలం

- రూ.7కు పైగా పెరిగిన ధర
- క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు కేక్‌ల తయారీ కోసం అధికంగా వినియోగం
- కొంత కృత్రిమ కొరత
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కోడిగుడ్డు ధర కొండెక్కింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రిటైల్ ధర రూ.7కు పైగా చేరింది. చలికాలంలో ధర పెరగడం సాధారణమే. అయినా ఇంత స్థాయిలో పెరగడం అరుదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరాంతంలో క్రిస్మస్, ఆంగ్ల సంవత్సర వేడుకలు ఉన్నాయి. ఈ ఉత్సవాలకు అధికంగా వినియోగించే కేకుల తయారీలో గుడ్డు వాడకం ఎక్కువ. దీంతో ధర మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే కిరాణా దుకాణాల్లో రూ.7.50 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో గుడ్డు వినియోగం పెరిగింది. మరో పక్క కార్తీక మాసానికి ముందు కోడి మాంసం కిలో ధర రూ.230 నుంచి రూ.240 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200 వరకు ఉంది. మాంసం ధర తగ్గి, గుడ్డు ధర మాత్రం విపరీతంగా పెరిగింది. నెలాఖరుకు మాంసం ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేటటౌన్)

గుడ్డు ధర రోజురోజుకూ పెరుగుతోంది. గత నెల క్రితం డజన్ గుడ్లు రూ.72 ఉండగా, ప్రస్తుతం రూ.90కి పైగా చేరింది. సూర్యాపేట జిల్లాలో నిత్యం 4.50లక్ష నుంచి 5.20లక్షల వరకు గుడ్ల విక్రయం జరుగుతోంది. పట్టణంలో నిత్యం 60వేల నుంచి 80వేల వరకు విక్రయిస్తున్నారు. గతంలో రోజంతా విక్రయించే గుడ్లు ఇప్పుడు కేవలం మూడు గంటల్లోనే విక్రయించడం గమనార్హం. పౌష్టికాహారంగా గుడ్డు తీసుకోవాలని ప్రచారం చేయడం, ప్రజల్లో అవగాహన పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణం. ఒక కుటుంబం వారంలో ఒక రోజు మాంసాన్ని విక్రయిస్తే కొందరు ప్రతీ రోజు గుడ్డును వినియోగిస్తున్నారు. జిల్లాలో 10కి పైగా కోళ్లఫారాలు ఉన్నాయి.అందులో 8లక్షలకుపైగా కోడిగుడ్ల ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో సుమారు 3లక్షల నుంచి 4లక్షల వరకు విజయవాడ,గుంటూరుతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి.

కేకుల కోసం ఆర్డర్లు..

సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఒక బేకరీ నిర్వహకుడు డిసెంబరు 31 వేడుకను దృష్టిలో ఉంచుకొని కొద్ది రోజుల నుంచి కేకుల తయారీలో నిమగ్నమయ్యాడు. అందుకోసం సదరు బేకరీ నిర్వాహకుడు ప్రతీరోజు 200పైగా కోడిగుడ్లను ఆర్డర్ ఇస్తున్నాడు. జిల్లా కేంద్రంలో సుమారు 100వరకు బేకరీలు ఉన్నాయి. అంతేగాక క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో కేకుల విక్రయాలు పెరుగుతుండడంతో కోడిగుడ్లకు డిమాండ్ పెరిగింది. అంతేగాక కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల క్రితం హాస్టల్ విద్యార్థులకు నూతన మెనూ ప్రకటించగా, అందులో ప్రతీ రోజు గుడ్లు ఇవ్వాలనే నిబంధన పెట్టింది. దీంతో డిమాండ్ పెరిగింది.

కృత్రిమ కొరత..


గుడ్ల ధరలు ఏటా నవంబరు, డిసెంబరు నెలలో కొంత పెరుగుతాయి. చలి కాలంలో గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. వేసవి కాలంలో గుడ్లు 10 నుంచి 12 రోజుల్లో విక్రయించాలి. అదే చలికాలంలో 20 రోజుల వరకు తాజాగానే ఉంటాయి. దీంతో కోళ్లఫారం నిర్వాహకులు చలికాలంలో గుడ్లను విక్రయించకుండా...

- మిగతా 6వ పేజీలో...



కోడిగుడ్డు ధర పెరుగుదల ఇలా

నెల	ధర
ఆగస్టు	రూ.5.70
సెప్టెంబరు	రూ.6.25
అక్టోబరు	రూ.6.29
నవంబరు	రూ.6.50
డిసెంబరు	రూ.7.20





గజ గజ

ఈ సీజన్‌లో అతి కనిష్ఠ ఉష్ణోగ్రత 16డిగ్రీలు నమోదు

చలి తీవ్రత తట్టుకోలేక ఆలయ వాచ్‌మన్ మృతి

ఉమ్మడి జిల్లాలో చలి గాలులు విజృంభిస్తున్నాయి. ఈ సీజన్‌లో మొదటిసారి సోమవారం 16.0డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజా వణుకుతున్నారు. శీతాకాలంలో గతానికి భిన్నంగా రోజంతా చలి ఉంటోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

చలి తీవ్రతను తట్టుకోలేక ప్రజలు ప్రత్యామ్నాయం వెతుక్కుంటున్నారు. ప్రధానంగా స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు, ఉన్ని దుస్తులు కొనుగోలుచేస్తున్నారు. అయినా చలి నుంచి తట్టుకోలేకున్నామని వృద్ధులు వాపోతున్నారు. ప్రజలు తెల్లవారుజామున లేచి పనులపై బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి వణికిస్తున్న చలి మరుసటి రోజు ఉదయం 9గంటల వరకు కూడా ఉంటోంది. చలి కారణంగా పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజామున పలు ప్రాంతాల్లో పొగమంచు కమ్ముకుంటుండటంతో రోడ్లపై వాహన రాకపోకలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రజలు పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఉదయం, సాయంత్రం చలిమంట వేసుకుంటూ చలి నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న రెండు రోజులు కూడా ఉమ్మడి జిల్లాలో చలి గాలులు పెరగడంతో పాటు ఉదయం వేళలో పొగ మంచు దట్టంగా అలుముకునే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ పేర్కొంటోంది. చలి తీవ్రత తట్టుకోలేక నల్లగొండ పట్టణంలోని తులసీనగర్‌లో ఉన్న హనుమాన్ గుడి వాచ్‌మెన్ చింతకాయల సత్తయ్య (61) మృతి చెందాడు.

ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
12	28.5	19.4
13	29.0	19.0
14	28.0	18.0
15	27.5	17.6
16	27.0	16.0

గ్రీవెన్స్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ శరత్ చంద్రపవార్



బాధితుల నుంచి వినతులు తీసుకొని వారితో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి గ్రీవెన్స్ డే నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారులు కృషి చేయాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30మంది ఫిర్యాదులను ఆయన నేరుగా స్వీకరించారు. వారి సమస్యలను విని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.

బాధితుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా వ్యవహరించి వారి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిశీలించి వేగంగా స్పందించాలని అన్నారు. బాధితులకు న్యాయం చేసి వారికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

క్రీడల్లో జిల్లాకు పేరు తీసుకురావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



క్రీడలను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీల్లో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ, నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను ఆమె సోమవారం జ్యోతి వెలిగించి ప్రా రంభించారు. సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభ సూచకంగా క్రీడా పతకాన్ని ఎగురవేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకే సీఎం కప్ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. అనంతరం మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డితో క లిసి మేకల అభినవ్ స్టేడియాన్ని సందర్శించారు. క్రీడాకారులను పరిచ యం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. కా ర్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: 'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ప్రజావాణి ఫిర్యాదులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ, మునిసిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖల వద్ద ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఆయా శాఖల అధికారులు ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలన్నారు. నియోజకవర్గాల్లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా విందు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ మేరకు సంబంధింత ఆర్డీవోలు, తహసీల్దారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కొత్త దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్వో అమరేందర్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యసౌకర్యాలు కల్పించాలి

నల్లగొండ: జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన జాతీయ క్యా న్సర్, మధుమేహం, గుండె నియంత్రణ కేంద్రాల్లో అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ఆమె జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిజిషియన్‌తో పాటు గుండె వైద్య నిపుణులు, అంకాలజిస్ట్ అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, సిటీ స్కాన్, ఎస్ఎన్‌సీయూ ఎమర్జెన్సీ, ఐసీయూ, డయాగ్నస్టిక్, ల్యాబ్ పరీక్షల కేంద్రాలతో పాటు వార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

చెర్వుగట్టు క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్ దంపతులు



నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠిభవేశ్ మిశ్రా దంపతులు సోమవారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ దంపతులకు అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూలవిరాట్టు వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉపాలయాలను దర్శించుకున్నారు. క్షేత్ర విశిష్టతను దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ కలెక్టర్‌కు వివరించగా వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేశారు. ఎండోమెంట్ జిల్లా సహాయ కమిషనర్ సులోచన, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్ స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి మూలవిరాట్ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, రేగట్టె నర్సిరెడ్డి, నేతకాని కృష్ణయ్య, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వారికి హోదా.. వీరికి ఉపాధి

- పెరిగిన సెకండ్‌హ్యాండ్ కార్ల విక్రయాలు
- మధ్యతరగతి, వ్యాపారులు, ఉద్యోగుల్లో పెరిగిన ఆసక్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

సొంత కారు కల పెరిగిన నేపథ్యంలో సెకండ్‌హ్యాండ్ కార్ల కొనుగోళ్లు పెరిగాయి. లాక్‌డౌన్ అనంతరం మధ్యతరగతి, ఉద్యోగుల్లో సొంత కారు ఉండాలనే ఆలోచన పెరిగింది. రూ.2లక్షల కనీస బడ్జెట్ నుంచి రూ.5లక్షల పరిమితితో సెకండ్‌హ్యాండ్ కార్లు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. దీంతో బస్సు ప్రయాణాలకు బదులు సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోలుకే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. దీంతో జిల్లాలోని పలు పట్టణాల్లో సెకండ్ హ్యాండ్ కార్ల ప్రత్యేక కన్సల్టెన్సీలు పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా కొందరికి జీవనోపాధి లభిస్తుండగా, అటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు, వాహనాలు లభిస్తున్నాయి.

6

వారికి హోదా.. వీరికి ఉపాధి



» లాక్‌డౌన్ తర్వాత పెరిగిన సెకండ్‌హ్యాండ్ కార్ల విక్రయాలు » మధ్య తరగతి, వ్యాపారులు, ఉద్యోగుల్లో పెరిగిన ఆసక్తి
» ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో విస్తరించిన కన్సల్టెన్సీలు » వ్యాపారానికి ఢోకా లేదంటున్న నిర్వాహకులు
» కన్సల్టెన్సీలతో ఉపాధి పొందుతున్న యువత » సెకండ్ హ్యాండ్ కారుతో రయ్...రయ్

సొంత కారు ఉండాలనే ఆకాంక్ష మధ్య, దిగువ మధ్యతరగతి వర్గాల్లో సెకండ్‌హ్యాండ్ కార్ల వినియోగాన్ని పెంచింది. లాక్‌డౌన్ అనంతరం కాస్త కుదుటపడిన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కుటుంబాలు సొంత కారు ఉండాలనే ఆలోచన పెరిగింది. రూ.2లక్షల కనీస బడ్జెట్ నుంచి రూ.5 లక్షల పరిమితితో కొనుగోలు చేయాలని, కుటుంబమంతా హాయిగా ప్రయాణించేలా సెకండ్‌హ్యాండ్ కార్లను సొంతం చేసుకోవాలనే ఆసక్తి మొదలైంది. మార్కెట్ కూడా విస్తరించడంతో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోళ్లు, అమ్మకాల కోసం ప్రత్యేక కన్సల్టెన్సీలు ఏర్పాటవుతున్నాయి. వీటిని ఏర్పాటు చేసి నిరుద్యోగ యువత కూడా జీవనోపాధి పొందడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన సేవలు, వాహనాలు అందిస్తున్నారు. వేర్వేరు కారణాలతో ఇటీవల ఈ మార్కెట్ కొంత మందగించినా వ్యాపారానికి ఢోకా లేదని, ఇది భవిష్యత్ ఉన్న రంగమని, నిజాయితీగా, పారదర్శకంగా పనిచేసే యువతకు ఇది చక్కటి ఉపాధి రంగమని పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)





నల్లగొండలోని కార్ల కన్సల్టెన్సీల వద్ద విక్రయానికి ఉన్నకార్లను పరిశీలిస్తోన్న కొనుగోలుదారులు.

సెకండ్ హ్యాండ్ కార్ల క్రయవిక్రయాలు నిర్వహించే ఆటో కన్సల్టెన్సీలు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో విస్తరించాయి. నిరుద్యోగ యువకులు మోటార్ రంగంలో ఇప్పటికే పని చేస్తూ కన్సల్టెన్సీలు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. సెకండ్‌హ్యాండ్ కార్లను తామే కొనుగోలు చేసి, మరమ్మతులు చేయించి అమ్మడంతో పాటు, విక్రయదారులు తమ కారు అమ్ముదల్చుకుంటే వీరి యార్డుల్లో ఉంచి కొనుగోలుదారులకు విక్రయించి కమిషన్ తీసుకుంటున్నారు. తమతో పాటు, మరో ఇద్దరు, ముగ్గురికి పని కల్పిస్తున్నారు. తమవద్ద కార్లు కొంటే నిజాయితీగా సేవలందిస్తున్నామని, యాక్సిడెంట్ కార్లు, ఇంజన్లు మరమ్మతులకు కార్లను వినియోగదారులకు సూచించబోమని, వినియోగదారులు మళ్లీ, మళ్లీ వచ్చేలా వారికి నాణ్యమైన సేవలందిస్తున్నామని చెబుతున్నారు. కార్లు కొనుగోలుకు అవసరమైన ఫైనాన్స్ సదుపాయం కూడా కన్సల్టెన్సీ నిర్వాహకులు కల్పిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మంచి మార్కెట్టే

సెకండ్‌హ్యాండ్ కార్లకు ఉమ్మడి జిల్లా ప్రధానమైన మార్కెట్ అని కన్సల్టెంట్లు పేర్కొంటున్నారు. జిల్లాలోని ద్వితీయ, తృతీయశ్రేణి పట్టణాల్లో సెకండ్‌హ్యాండ్ కార్లకు డిమాండ్ ఉంటోంది. ఉద్యోగులు, చిరు వ్యాపారులు, చిరు ద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహించే యువత, దిగువ మధ్యతరగతి వర్గాలు సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోళ్లకు ప్రాధాన్యమిస్తున్నారని చెబుతున్నారు. ఏదైనా ఫంక్షన్లకు వెళ్లాలన్నా, ఆదివారాల్లో కుటుంబ సమేతంగా టూర్ వెళ్లాలన్నా బస్సులు, రైళ్లలో వెళ్లి ఇబ్బంది పడకుండా సొంత కార్లుంటే ప్రయాణం సాఫీగా సాగుతుందని, ఈ నేపథ్యంలోనే దిగువమధ్యతరగతి వర్గాలవారు సెకండ్ హ్యాండ్ కార్లు కొనడానికి ఇష్టపడుతున్నారు. రూ.2లక్షల నుంచి రూ.5లక్షల లోపు ధర ఉండే కార్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని, అంతకుమించి ధర పెట్టే సామర్థ్యం ఉన్నవారు కొత్త కార్లవైపు వెళ్తున్నారని కన్సల్టెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు.

ఆ రెండు కారణాలతో..

సెకండ్‌హ్యాండ్ కార్ల అమ్మకాలు ఇటీవల కొంచెం తగ్గాయి. ప్రధానంగా హైడ్రా ఎఫెక్ట్‌తో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడంతో దాని ప్రభావం ద్వితీయ, తృతీయశ్రేణి పట్టణాలపైనా పడిందని, ఇక్కడ కూడా రియల్ వ్యాపారంలో ఏజెంట్లుగా, కన్సల్టెంట్లుగా పనిచేసేవారికి ఆదాయం తగ్గిందని దీని ప్రభావం కార్ల వినియోగంపైనా పడిందని చెబుతున్నారు. వీటికి తోడు మోటార్ వెహికల్ చట్టం నూతన నిబంధనల ప్రకారం ఎలాంటి వాహనమైనా 15ఏళ్ల తర్వాత తొలగించాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలివ్వడం కూడా సెకండ్ హ్యాండ్‌కార్ల అమ్మకాలపై ప్రభావం చూపిందని చెబుతున్నారు. కొత్తకారు కొనుగోలు ఎక్కువ భాగం ఆరు నుంచి ఏడేళ్ల తర్వాత మరో మోడల్‌కి మారేటప్పుడు ఈ కారు సెకండ్స్‌లో వి క్రయిస్తున్నారని, గతంలో కారు ఫిట్‌నెస్ ఉంటే ఎన్నేళ్లయినా ఎలాంటి అభ్యంతరాలు ఉండకపోవడంతో ఫిట్‌నెస్ చేయించుకుంటూ పాతకార్లను ద్వితీయ, తృతీయశ్రేణి పట్టణాల్లో నివసించేవారు, గ్రామీణ ప్రాంత నివాసితులు వాడేవారని, ఇప్పుడు వీటి గడువు తక్కువగా ఉండడంతో పాతకార్ల కొనుగోళ్లపై ఆలోచన చేస్తున్నారని చెబుతున్నారు. ఏడాదిన్నర క్రితం కార్ల విక్రయాలు నెలకు పది పదిహేనువరకు ఉండేవని, ప్రస్తుతం ఆరేడుకి మించి అమ్మలేకపోతున్నామని చెబుతున్నారు. ఈ నెలలో కాస్త పుంజుకున్నాయని, జనవరిలో మళ్లీ విక్రయాలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు.

నాణ్యమైన సేవలు అందిస్తాం



ఏడాదిగా కార్ల కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాను. డిగ్రీ వరకు చదివి కన్సల్టెన్సీ ప్రారంభించడానికి ముందు కూడా కరోనా నుంచి కార్లు కొని విక్రయించా. ప్రస్తుతం నెలకు పది వరకు కార్లు విక్రయిస్తున్న. నాణ్యమైన సర్వీసు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తాం. మా వద్దకు వచ్చేది మధ్య తరగతికి చెందినవాళ్లే. నిజాయితీగా మంచి వాహనాలు ఇప్పిస్తేనే మా వ్యాపారం కూడా సజావుగా ఉంటుంది. దీని ద్వారా నాకు జీవనోపాధితో పాటు, మరో ఇద్దరికి నావద్ద పని లభిస్తుంది.

- బొట్ల ప్రణీత్, నల్లగొండ.

మాపై నమ్మకమే కొనుగోళ్లకు ఊతం



మా కుటుంబం 30 ఏళ్ల నుంచి మోటర్ రంగంలోనే ఉంది. మేమిచ్చే సర్వీసు, నాణ్యత, నిజాయితీగా వాహన పరిస్థితిని తెలియజేయడం వల్లనే మేం మార్కెట్లో నిలబడగలిగాం. ఈ కన్సల్టెన్సీని ప్రారంభించకమునుపు కూడా సెకండ్స్ వాహనాలు కొని అమ్మేవాళ్లం. 12 ఏళ్లుగా కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాం. మధ్యతరగతి, చిరు ఉద్యోగులు, చిరువ్యాపారులు సెకండ్స్ వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. కొత్తకార్లకు కూడా అతి తక్కువ డౌన్‌పేమెంట్లు, ఈఎంఐలు ఇస్తుండడంతో సెకండ్స్‌వాహనాలకు కొంత డిమాండ్ తగ్గింది. రూ.5లక్షల లోపు బడ్జెట్ ఉన్న వాహనాలే ఇక్కడ ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. అంతకుమించిన ధర కలిగినవి, పెద్దవాహనాలకు ఇక్కడ మార్కెట్ ఉండదు. ఇటీవల లాభాలు తగ్గాయి. పోటీ ఎక్కువగా ఉండడంతో ఒక్కో నెలలో కిరాయిలు కూడా వెళ్లని పరిస్థితి ఏర్పడుతోంది.

- పగిళ్ల సైదులు, నల్లగొండ

15 ఏళ్ల వాహనాలు తొలగించాలనే నిబంధనతో విక్రయాలు తగ్గాయి



12 ఏళ్లుగా కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నా. లాక్‌డౌన్ తర్వాత సెకండ్ హ్యాండ్ వాహనాలు భారీగా అమ్ముడయ్యాయి. ఏడాది నుంచి మార్కెట్ కాస్త మందగించింది. 15 ఏళ్ల సీనియార్టీ ఉన్న వాహనాలను తొలగించాలనే నిబంధన అమల్లోకి వచ్చాక సెకండ్స్ కార్ల విక్రయాలు కాస్త మందగించాయి. ఆరేడేళ్లు నడిపిన తర్వాతే వాహనాలను సెకండ్స్‌లో అమ్ముతుంటారు. అప్పటికే వాహనం ఫిట్‌నెస్ కొంత తగ్గుతుంది. వీళ్లు కొన్నాక మరో అయిదారేళ్లయినా నడుపుకుని, మళ్లీ అమ్ముకుంటే కనీసం సగమైనా ధర గతంలో వచ్చేది. ఈ నిబంధనతో ఆపరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఇటీవల సెకండ్స్ వాహనాల అమ్మకాలు తగ్గాయి.

- అహ్మద్ వసీమ్, నల్లగొండ

వరకట్నం వేధింపుల కేసులో జైలుశిక్ష

నల్లగొండ క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం వేధింపులకు పాల్పడిన భర్త, బాధితురాలి అత్తకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు, అదనపు జిల్లా జడ్జి దుర్గా ప్రసాద్ తీర్పు ఇచ్చారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణానికి చెందిన ఏలె భవానికి నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఏలె హరీష్‌తో 2017లో వివాహ జరిగింది. వివాహ సమయంలో పెద్దల సమక్షంలో కొంత కట్నం ఇవ్వగా, కొద్ది రోజుల తర్వాత హరీష్ చెడు వ్యసనాలకు అలవాటు పడి అదనపు కట్నం భవానిని వేధించేవాడు. హరీష్ అమ్మ కూడా వేధింపులకు పాల్పడడంతో నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. దర్యాప్తు అనంతరం అప్పటి ఇచారణ అధికారి వి. బాలగోపాల్ కోర్టుకు చార్జిషీట్ అందజేశారు. నేరం రుజువు కావడంతో హరీష్‌కు 2సంవత్సరాల 8 నెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా, భావాని అత్తకు ఏడాది జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసులో సరైన ఆధారాలు సేకరించి సాక్ష్యాలను కోర్టుకు అందజేసి నిందితులకు శిక్ష పడే విధంగా చేసిన అప్పటి సీఐ బాలగోపాల్, ఏపీపీ జవహర్‌లాల్, ప్రస్తుత ఎస్‌హెచ్‌వో రాజశేఖర్, కోర్టు కానిస్టేబుల్ సుధాకర్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు నరేందర్, కానిస్టేబుల్ మల్లికార్జున్‌ను ఎస్పీ అభినందించారు.

అదుపు తప్పి కాల్వలో పడిన లారీ

● తడిసిన రూ.12లక్షల విలువైన బియ్యం



జేతురాంతండా సమీపంలో కాల్వలో పడిన బియ్యం లోడు లారీ

తుర్కపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బాయిల్డ్ బియ్యం లోడుతో వెళ్తున్న లారీ ఆదివారం రాత్రి అదుపు తప్పి యాదాద్రిభువగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని జేతురాంతండా సమీపంలోని కాల్వలో పడిపోయింది. ఎస్‌ఐ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్ సంగమేశ్వర్ మెదక్ జిల్లా తూప్రాన్ నుంచి లారీలో బాయిల్డ్ రైస్ లోడుతో కాకినాడకు బయలు దేరాడు. రాత్రి సమయంలో జేతురాంతండా సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు వద్ద లారీ అదుపు తప్పి కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ-15 కాల్వలో పడిపోయింది. లారీ పూర్తిగా నీటిలో మునిగిపోయింది. డ్రైవర్ సంగమేశ్వర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. లారీలో 35టన్నుల బాయిల్డ్ బియ్యం పూర్తిగా తడిసి పోయింది. క్రేన్ సాయంతో లారీని బయటకు తీస్తున్న క్రమంలో బియ్యం బస్తాలు నీటిలో మునిగిపోయాయి. రూ.12లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైస్‌మిల్ యాజమాని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రం లోని ఎస్సీ కాలనీలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన పెదమాము సైదులు, కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం 5గంటల గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటల ధాటికి ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా పగిలిపోయాయి. ఇంట్లోని వంట సామాగ్రి, దుస్తులు, దుప్పట్లు, ఇతర వస్తువులు కాలిపోయాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు యత్నించారు. వెంటనే హాలియాలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. ప్రమాదంలో సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు సైదులు, ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దవూర, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏనేమీదిగూడెం గ్రామానికి చెందిన ఎరుకల గోపయ్య(55), కొమ్మగోని మల్లయ్య ద్విచ క్రవాహనంపై ఏనెమీదిగూడెం నుంచి పెద్దవూరకు వస్తుండగా సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పెదవూర వైపు నుంచి మల్లేపల్లికి పశువుల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం మార్కెట్ యార్డు సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద టీవీఎస్‌ను ఎదురుగా ఢీకొట్టింది. గోపయ్య, మల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎరుకల గోపయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. గోపయ్యకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

● ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన మాజీ సర్పంచుల అరెస్టు



నల్లగొండ జిల్లా కనగల్ పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచులు

నల్లగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన ఉమ్మడి జిల్లాలోని పలువురు సర్పంచులను పోలీసులు సోమవారం ముందుస్తుగా అరెస్టు చేశారు. కనగల్‌లో మాజీ సర్పంచులను అరెస్టు చేసి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. మాజీ సర్పంచులు ఐతగోని యాదయ్యగౌడ్, కడారి క్రిష్ణయ్య మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా ప్రభుత్వం మాజీ సర్పంచులను వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పగిళ్ల యాదయ్య, బండమీది రాము, ఆదిమళ్ల లింగయ్య, అవురేశి శ్రీను, భాస్కర్‌రెడ్డి, మారయ్య ఉన్నారు.

● సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని మాజీ సర్పంచ్ గాలి రామకృష్ణ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ప్రభుత్వం విడుదల చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బొలిశెట్టి సుధీర్‌బాబు, వెన్న రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రామారావు, జోగు అరవిందరెడ్డి, కుసుమ శ్రీనివాసరెడ్డి, పిడమర్తి అంజి, తెల్లబాటి నరేష్ ఉన్నారు.

● మద్దిరాలలో మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు వెంకన్న, ఉపేందర్, వెంకన్న తదితరులు ఉన్నారు.

● నల్లగొండ జిల్లా నాంపల్లిలో మాజీ సర్పంచులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన సర్పంచ్‌లు నర్సింహులగూడెం మాజీ సర్పంచ్ బలుగూరి విష్ణువర్ధన్, వడ్డెపల్లి మాజీ సర్పంచ్ బూషిపాక లీలప్రియ నాగేష్ తదితరులు ఉన్నారు.

10నెలల క్రితం అదృశ్యమై అస్థిపంజరంగా మారి..

● చెట్ల పొదల్లో కుళ్లిన శవంగా లభ్యం

సూర్యాపేటరూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పది నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి శవంగా లభ్యమయ్యాడు, ఈ ఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని కేటీఅన్నారం గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గందం నాగయ్య(55) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మార్చి 1వ తేదీన ఇంటి నుంచి నాగయ్య ఆచూకీ కోసం కుటుంబసభ్యులు చుట్టు పక్కల గ్రామాలలో వెతికారు. ఎంతకూ ఆచూకీ లభించకపోవడంతో నాగయ్య భార్య లక్ష్మమ్మ మార్చి 7న సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గ్రామానికి చెందిన నక్కల వెంకన్నగౌడ్ సోమవారం గ్రామ శివారులో ఉన్న ముత్యాలమ్మ గుడి దగ్గర ఉన్న చెట్ల పొదల్లో ఉన్న తాటిచెట్లను గీసేందుకు ముందుగా చెట్ల పొదలు శుభ్రం చేసుకుంటూ లోపలికి వెళ్లాడు ఈ క్రమంలో ఓ ఈత చెట్టు దగ్గర కుళ్లిన శవం, మనిషి పుర్రె కన్పించడంతో ఆయన వెంటనే గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్థులు అస్థిపంజరం వద్ద ఉన్న చెప్పులు, సెల్‌ఫోన్‌ను గుర్తించి నాగయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు కూడా మొదట్లో గుర్తుపట్టలేదు. తర్వాత దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్ చూసి గుర్తుపట్టారు. అయితే నాగయ్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అక్కడి ఆనవాళ్లు ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. 10 నెలల కిత్రం కన్పించకుండా పోయిన నాగయ్య ఊర్లోనే విగితజీవిగా కన్పించడంతో కుటుంబసభ్యులు కన్నీంటి పర్వంతమయ్యారు.

ఏడు విడతలుగా సాగునీరు

నాగార్జునసాగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వ ఆయకట్టుకు యాసంగి సాగుకు నీటి విడుదల కోసం అధికారులు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. డిసెంబరు 15నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 12వ తేదీ వరకు ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో యాసంగి సాగుకు నీటిని విడుదల చేయనున్నట్లు ఎస్ఈ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. వారబందీ ప్రకారం సాగునీటిని అందజేస్తామని, రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. మొత్తం 7 విడతలుగా నీటిని విడుదల చేయనున్నట్లు వివరించారు.

సాగునీటి విడుదల షెడ్యూల్ ఇలా...

విడతలు	నీటి విడుదల	నిలుపుదల
మొదటి	15-12-24 నుంచి 11-1-25	12-1-25 నుంచి 18-1-25
రెండో	19-1-25 నుంచి 28-1-25	29-1-25 నుంచి 04-2-25
మూడో	5-2-25 నుంచి 14-2-25	15-2-25 నుంచి 21-2-25
నాలుగో	22-2-25 నుంచి 3-3-25	4-3-25 నుంచి 10-3-25
ఐదో	11-3-25 నుంచి 20-3-25	21-3-25 నుంచి 27-3-25
ఆరో	28-3-25 నుంచి 6-4-25	7-4-25 నుంచి 13-4-25
ఏడో	14-4-25 నుంచి 23-4-25	

ఆదాయ పన్ను వివాదాలు పరిష్కరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదాయ పన్ను అధికారి మోహన్

నల్లగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివాద్- సే- విశ్వాస్ స్కీం 2024ను ఉపయోగించుకొని ఆదాయ పన్ను సంబంధిత వివాదాలు పరిష్కరించుకోవాలని ఆదాయ పన్ను అధికారి లింగబత్తుల మోహన్ సూచించారు. వివాద్-సే-విశ్వాస్ స్కీంపై నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకానికి సంబంధించి తగిన సలహాలు, సహాయం ఇవ్వడానికి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల చార్టెడ్ అకౌంటెంట్లు, ఆదాయం పన్ను ప్రాక్టిషనర్లు కృషి చేస్తారని తెలిపారు. అక్టోబరు 1వ తేదీ నుంచి ఈ పథకం అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదాయ పన్ను డిప్యూటీ కమిషనర్ రవి కిరణ్, సంయుక్త కమిషనర్ ముకాబీ కేఎన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలో చోరీ.. ఆభరణాలు అపహరణ

నల్లగొండ క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో రెండిళ్లలో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో హైదరాబాద్ రోడ్డులో ఉన్న కాకతీయనగర్‌లో ఆవుల నాగరాజు, పిట్టల రమేష్‌లు పక్కపక్క ఇళ్లలోనే అద్దెకు ఉంటున్నారు. ఈ నెల 15వ తేదీన ఇద్దరు కుటుంబాలతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. సోమవారం వారు వచ్చి ఇళ్లను పరిశీలించే సరికి రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి ఉన్నాయి. నాగరాజు ఇంట్లో రెండు తులాల బంగారు ఆభరణాలు, రమేష్ ఇంట్లో రెండు తులాల ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఆవుల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపారు.

వైన్స్‌షాప్‌లో..

కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గల హైదరాబాద్ రోడ్ బైపాస్‌లో గల శ్రీలక్ష్మి వైన్స్ షాప్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాప్ యజమాని, నిర్వాహకుడు తెలిపిన వివరాల ప్రకారం... రోజు మాదిరిగినే నిర్వాహకులు ఆదివారం రాత్రి 10గంటల సమయంలో వైన్స్ మూసివేసి వెళ్లారు. దుండగులు అర్ధరాత్రి దుకాణం వెనుక నుంచి వచ్చి తలుపులు పగలగొట్టి గల్లాలో ఉన్న రూ.10 వేల నగదు, పది రూపాయల బిళ్ళలు మొత్తం రూ.12వేలు అపహరించారు. అదేవిధంగా కంప్యూటర్ హార్డ్ డిస్క్ దొంగించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాంమ్మూర్తి తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మేళ్లచెర్వు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాహనంలో ఏపీకి తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం తెల్లవారుజామున మండల పరిధిలోని రేవూరు గ్రామంలో కొందరు 50 బస్తాల రేషన్ బియ్యాన్ని తెల్లరేషన్ కార్డుల దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాహనంలో ఏపీకి తరలిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం రేవూరు గ్రామంలో వాహనాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. లక్ష్మీనారాయణ, సాయిమాధవ్, సుల్తాని బాలు, నవీన్, అచ్చారావు, పద్మ, సుగుణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుడ్డు ప్రియులకు గడ్డుకాలం

(5వ పేజీ తరువాయి)

జనవరి వరకు నిల్వ ఉంచుతుండటంతో కృత్రిమ కొరత ఏర్పడి డిమాండ్‌తో పాటు ధర పెరుగుతోంది.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఇబ్బందులే

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో గుడ్డు ఇచ్చేందుకు ఏజెన్సీలు ఆపసోపాలు పడుతున్నాయి. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తుండగా అదనంగా రూ.2కు పైగా ధర పెరగడంతో పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. నల్లగొండ జిల్లాలో 1,483 వంట ఏజెన్సీలు, సూర్యాపేట జిల్లాలో 917 ఏజెన్సీలు, యాదాద్రి జిల్లాలో 729 మధ్యాహ్న భోజన ఏజెన్సీలున్నాయి. 2.11 లక్షల మంది విద్యార్థులున్నారు. ఏళ్ల నుంచి పాత ధరలే అమలవుతుండటంతో ఏజెన్సీలకు ఇబ్బందులు తప్పడం లేదు. మెనూ ప్రకారం వారంలో మూడు గుడ్లు ఇవ్వాలి. ఇప్పటికే కూరగాయల ధరలు పెరగడంతో వంట ఏజెన్సీలు ఇబ్బందులు పడుతుండగా, గుడ్డ ధర పెరుగుదలతో మరింత ఆర్థికభారం పడుతోందని ఏజెన్సీ నిర్వాహకులు గగ్గోలుపెడుతున్నారు. ఏజెన్సీలకు కూరగాయలు, గుడ్డు బిల్లును ప్రత్యేకంగా ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఆరు మాసాలుగా గుడ్ల బిల్లులు రావడం లేదని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు.

గతంలో ఎన్నడూ లేదు

ప్రతీ రోజు గుడ్డు తింటున్నాం. రోగ నిరోధక శక్తి పెరుగుదలకు ఉదయం, సాయంత్రం కూర ఏదైనా గుడ్డు తప్పకుండా వాడుతున్నాం. మాంసం ధర, కూరగాయల ధరలు పెరగడంతో గుడ్లే కొనుగోలు చేస్తున్నాం. ధరలు పెరగడంతో కొంత ఇబ్బంది పడుతున్నాం.

● వెంకటేష్, సూర్యాపేట

అధికంగా కొనుగోలు చేస్తున్నారు

ప్రస్తుతం కోడిగుడ్డు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. గతంలో రూ.6 ధర ఉండగా, ప్రస్తుతం రూ.8 వరకు విక్రయిస్తున్నాం. ఉత్పత్తి లేక ధరలు పెరిగాయి.

● రాము, దుకాణ నిర్వాహకుడు, సూర్యాపేట

సూర్యాపేట జిల్లాలో వ్యవసాయ కళాశాల

● అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ వ్యవసాయ వర్సిటీకి అనుబంధంగా సూర్యాపేట జిల్లాలో అగ్రి కల్చర్ కాలేజీ ఏర్పాటు కానుంది. అసెంబ్లీ లోని తన చాంబర్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కోదాడ లేదా హుజూర్ నగర్ నియోజకవర్గాల్లో వ్యవసాయ కాలేజీ ఏర్పాటు చేయాలన్నది తన ఆకాంక్ష అని వెల్లడించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఎక్కడ కాలేజీ ఏర్పాటుకు అవసరమైన భూమి ఉందో గుర్తించాలని జిల్లా అధికారులకు అప్పటికప్పుడే ఫోన్ చేసి సూచించారు. కాలేజీ ఏర్పాటుకు కనీసంగా వంద ఎకరాలు అవసరమన్నారు. అనువైన స్థలం ఎక్కడా దొరకకుంటే చిలుకూరు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో కాలేజీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే ఎన్ఎస్పీ స్థలాలను వేలం వేసే అంశాన్నీ పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

చట్టసభల్లో మన గళం..

కరువు జిల్లాలకు నిధులు కేటాయించాలి

● పార్లమెంట్‌లో ప్రస్తావించిన భువనగిరి ఎంపీ చామల



భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కరువు పీడిత జిల్లాలను పునర్ గణన చేసి వాటి అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి కోరారు. దేశంలోని మొత్తం కరువు పీడిత జిల్లాల్లో నేషనల్ అడాప్టేషన్ ఫండ్ ఫర్ క్లైమెట్ ఛేంజ్ (ఎన్‌ఏఎఫ్‌సీసీ) పథకం కింద మూడు సంవత్సరాల్లో కేటాయించిన నిధులు ఖర్చుల అంశంపై ఆదివారం పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కరువు పీడిత జిల్లాల్లో ప్రజారోగ్యం, వ్యవసాయం, నీటివనరులు తదితర వాటికి ఏ మేరకు నిధులు కేటాయించి వినియోగించారో తెలియజేయాలని ఎంపీ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాతో పాటుగా నల్లగొండ, జనగాం, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు కరువు తీవ్రతను ఎదుర్కొంటున్నాయని, నేషనల్ అడాప్టేషన్ ఫండ్ ఫర్ క్లైమెట్ చేంజ్ పథకం కింద కేవలం మహబూబ్‌నగర్ జిల్లాకు రూ.24కోట్లు నిధులు మాత్రమే కేటాయించిస్తే పరిస్థితులు ఏమీ మారలేదని తెలిపారు. భవిష్యత్తులో మహబూబ్ నగర్ జిల్లాకు అదనంగా నిధులు కేటాయిస్తూ నల్లగొండ, కరీంనగర్ వంటి ఇతర కరువు ప్రభావిత జిల్లాలకు కూడా నిధులు కేటాయించడానికి ప్రణాళికలు రూపొందించాలని ఆయన ప్రస్తావించారు.

ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

● అసెంబ్లీలో ప్రస్తావించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఖిల్లాకు 700 సంవత్సరాలకుపైగా సుదీర్ఘ చరిత్ర ఉందని, నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార చిహ్నామైన పూర్ణకుంభం దేవరకొండ ఖిల్లాలోనిదే అన్నారు. చారిత్రక కట్టడాలు, అద్భుత కట్టడాలు ఉన్నాయని, నిర్వహణలేక శిథిలావస్థకు చేరుకుందన్నారు. నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. దేవరకొండ ఖిల్లాతోపాటు దేవరచర్లలోని శివాలయం, ఏలేశ్వరం, గాజుబేడం గుహలు చక్కటి ప్రదేశాలని, ఆహ్లాదకరంగా ఉంటాయన్నారు. గత ప్రభుత్వం అద్భుత కట్టడాలు కలిగిన ఖిల్లాను పట్టించుకోలేదన్నారు.

సాగర్‌లో మినీ జూపార్క్ ఏర్పాటు చేయాలి

● అసెంబ్లీలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



హాలియా, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నియోజకవర్గంలో మినీ జూపార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి కోరారు. అసెంబ్లీలో సోమ వారం ఆయన మాట్లాడుతూ బుద్ధవనం ప్రాజెక్టు నాగార్జునసాగర్‌లో ఏర్పాటు చేయడంలో అప్పటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కుందూరు జానారెడ్డి కృషి ఎనలేనిదని జైవీర్‌రెడ్డి ప్రస్తావించారు. బుద్ధవనం ప్రాజెక్టుకు 274 ఎకరాల అటవీ భూమిని సేకరించి ప్రభుత్వానికి అప్పగించారని బుద్ధవనాన్ని మరింత అభివృద్ధి కోసం ఇప్పటికే మంత్రుల దృష్టికి తీసుకురాగా రెండు సార్లు పరిశీలించారని ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న హరిత, వీజెఆర్ హోటళ్లలో ఉన్న గదులు పునర్ నిర్మాణానికి ఇప్పటికే రూ.5 కోట్లు కేటాయించారని అవి సరిపోవని, అదనపు నిధులు కేటాయించాలని కోరారు. వీకెండ్‌లో పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని అదనపు గదుల నిర్మాణం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. బుద్ధ వనం పరిసరాల్లో కన్వెన్షన్, ఫై స్టార్ హోటల్స్ నిర్మాణం చేపడితే ప్రభుత్వానికి పర్యాటకం ద్వారా ఆదాయం సమ కూరుతుందని అదే విధంగా స్థానిక యువకులకు ఉపాధి దొరుకుతుందని ఆయన తెలిపారు.

క్రమబద్ధీకరించే వరకూ సమ్మె

● కొనసాగుతున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె

భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులను పర్మినెంటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, అప్పటి వరకు సమ్మె కొనసాగిస్తామని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంగ పాండరి, మద్దెల తిరుపతి అన్నారు. సమగ్ర శిక్షలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలిపారు. సమ్మెను ఉద్దేశించి పాండరి, తిరుపతి మాట్లాడుతూ, ప్రజాపాలనలో అన్ని వర్గాలకు న్యాయం



నల్లగొండలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు

చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని అన్నారు. అధికారంలోకి రాకముందే మాట ఇచ్చి అందలమెక్కాక అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలో సమారు 500 మందికిపైగా సమగ్ర శిక్ష అభియాన్‌లో ఉద్యోగులు ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణించినా, కనీసం ఎక్స్‌గ్రేషియా ఇవ్వకపోవడం దారుణమన్నారు. 61 సంవత్సరాలకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేశారు. కాగా సమ్మెకు జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం ట్రస్మా సంఘీభావం తెలిపింది. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, నాయకులు యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉద్యోగులతో పాటు సమ్మె శిబిరంలో కూర్చొని మద్దతు పలికారు. అదేవిధంగా పీఆర్టీయూ పోచంపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మహేంద్రనాథ్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో భవాని, నరేందర్, కవిత, శిరీష, శ్రీనివాస్, సురేందర్‌రావు, కరుణాకర్, చందర్ పాల్గొన్నారు.



నల్లగొండలో నినాదాలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఇచ్చిన హామీ నెరవేర్చాలి

సూర్యాపేట(కలెక్టరేట్) డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన మాటను నెరవే ర్చాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాంపంగు వెంకటేశ్వర్లు అన్నారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదుకునేంత వరకు ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేసి పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీని వాస్, వెంకటరమణ, రాంబాబు, సైదులు, శ్రీనివాస్, శ్రీను, వెంకటేశ్వర్లు, పెండెం శ్రీనివాస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠాలు చెప్పేదెవరు సారూ..!

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఉపాధ్యాయులు సమ్మె బాట పట్టడంతో పాఠం చెప్పేవారు కరువయ్యారు. సిలబస్ పూర్త వుతుందో లేదోనని విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారు. దీంతో ఎంఈవో కార్యాలయాల్లో పనులు స్తంభించగా.. భవిత కేంద్రాలకు తాళాలు పడ్డాయి. కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. కేజీబీవీల్లో విద్యార్థులకు భోజనం, ఇతర విషయాల్లో అసౌకర్యం కలగకుండా నాన్‌టీచింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఎఫ్ఏ-3 పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణతో తరగతులు నిర్వహిస్తుండగా. కేజీబీవీ విద్యార్థులకు సబ్జెక్టులు పూర్తిగా వెనుకబడిపోవడంతో పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపనుంది. సమగ్ర శిక్షలో మెస్సెంజర్స్, ఎంఐఎస్ సీసీవో, వాచ్‌మెన్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్ కస్తూర్బ, అర్బన్ రెసిడెన్షియల్, భవితకేంద్రాల్లో ఐఈఆర్పీలు, డ్రాయింగ్, ఆర్ట్స్ క్రాఫ్ట్, వ్యాయామ విద్య ఉద్యోగులు, కుక్, ఏఎన్ఎం, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్పీలు, సీఆర్టీలు 31 మంది ఉన్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఇద్దరి ముగ్గురు విధులు నిర్వర్తిస్తుండగా మిగిలిన వారు విధులకు గైర్హాజరవు తున్నారు.



పీఏపల్లిలో సమ్మెతో మూతపడిన మండల వనరుల కేంద్రం

తెరుచుకోని మండల విద్యాశాఖ కార్యాలయం

మర్రిగూడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను అమలు చేయాలని చేస్తున్న ధర్నాలో భాగంగా సోమవారం విద్యాశాఖ కార్యాలయం తెరచుకోలేదు. ఈ నెల 6 నుంచి వారి సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో 9వ తేదీ వరకు నిరసన తెలపుతున్నారు. ప్రభుత్వం స్పందించిక పోవడం వల్ల ఈనెల 10 నుంచి నల్లగొండ జిల్లాకేంద్రంలో ధర్నా చేస్తుండడంతో మండలంలో ఉన కార్యాలయం తెరవక పోవడంతో కార్యాలయానికి వచ్చిన వారు వెనుదిరుగుతున్నారు.

పనులు పూర్తికాక.. బిల్లులు రాక

భువనగిరి రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు గత ప్రభుత్వం మన ఊరు- మన బడి పథకానికి శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఆందోళనకు గురవుతున్నారు. బంగారం, ఇళ్ల స్థలాలు కుదువ పెట్టి అప్పులు చేసి ఆయా పాఠశాలలో వసతులు కల్పించి సంవత్సరం గడిచిన తమను పట్టించుకోకపోవడం దారుణమని వాపోతున్నారు. అనేకసార్లు ప్రజావాణి కార్యక్రమాల్లో కలెక్టర్లకు రాతపూర్వకంగా వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదని నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం మారడం పథకంలో మార్పులు తీసుకురావడంతో బిల్లుల గురించి ప్రస్తావన రావడం లేదు. జిల్లాలో 728 ప్రభుత్వ పాఠశాలల ఉండగా, 718 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 10ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 489 , అప్పర్ ప్రైమరి స్కూల్ (యూపీఎస్)70, హైస్కూల్‌లు 169 ఉన్నాయి. మన ఊరు మన బడి పథకం కింద 250 పాఠశాలలను ఎంపిక చేసి వంటా, భోజనశాలలు, మరుగు దొడ్ల నిర్మాణం ప్రహరీ, మంచినీటి ట్యాంకులు, విద్యుదీకరణ తదితర మరమ్మతులు చేపట్టేందుకు రూ.43.08కోట్లు నిధులు మంజూరు



భువనగిరిలోని బాగాయత్ స్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణం

చేసింది. మొత్తం 64 పాఠశాలల్లో పనులు పూర్తయి నప్పటికీ రూ.13.17కోట్లను మాత్రమే ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించింది. దాదాపు 187 పాఠశాలల్లో కొంత మేర పనులు చేపట్టినప్పటికి చేసిన పనులకు కూడా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులను నిలిపివేశారు. అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడం ఎన్నికల కోడ్ నేపథ్యంలో బిల్లులు రాక సకాలంలో పనులు పూర్తి కాక మన ఊరు మన బడి పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయి.

సజావుగా గ్రూప్- 2 పరీక్ష

● పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠభద్రత
● కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ



భువనగిరిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న హనుమంత రావు

నల్లగొండ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్- 2 పరీక్షలను నల్లగొండ, భువనగిరి జిల్లాలో అధికారులు సజావుగా నిర్వహించారు. రెండు రోజుల పాటు (ఆదివారం, సోమవారం) నిర్వహించిన గ్రూప్- 2 పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు, ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన 87 పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తూ పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 600 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించి పటిష్ఠ చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులోకి తెచ్చారు. దీంతో పరీక్ష కేంద్రావద్ద గుంపులుగా లేకుండా అధికారులు సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూంకు చేరే వరకూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేయడంతో నల్లగొండ జిల్లాలో గ్రూప్ 2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

యాదాద్రి భువనగిరిలో సగానికిపైగా గైర్హాజరు

భువనగిరి టౌన్ (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. రెండవ రోజు సోమవారం సగానికి పైగా అభ్యర్థులు గైర్హాజరయ్యారు. భువనగిరిలోని 14 పరీక్షా కేంద్రాల్లో 6,078 మంది అభ్యర్థులకు గాను ఉదయం పరీక్షకు 2909 మంది హాజరుకాగా 3169 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు కూడా 2907 మంది మాత్రమే హాజరు కాగా 3171 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ హనుమంత రావు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు తదితర సిబ్బందితో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. రెండు రోజుల గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఉద్యోగ నోటిఫికేషన్ల జారీ కోసం ఉద్యమాలు చేసిన అభ్యర్థులు తీరా పరీక్షలకు భారీగా గైర్హాజర్ కావడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



నల్లగొండలోని ది నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో పరీక్ష తీరును పర్యవేక్షిస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్, డీఎస్పీ, తదితరులు

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 30 రోజుల పాటు జరిగే ధనుర్మాస ఉత్సవాలు సోమవారం వైష్ణవ ఆలయాల్లో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. నల్లగొండ పట్టణ ంలోని రామగిరిలో గల సీతారామ చంద్రస్వామి ఆలయంలో అర్చకులు ఆండా ళ్ అమ్మవారికి పూజలు నిర్వహించి ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పా ల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మునిసిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వికాస తరంగిణి సభ్యుడు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు రచించిన తిరుప్పావై మొదటి పాశురాన్ని శ్రీమాన్ భాష్యం జగన్నాథచార్యులు ప్రవచించారు. అదేవిధంగా వికాస తరంగిణి భక్తులచే సాముహిక విష్ణు సాహస్ర నామపారాయణం చేశారు. కార్యక్రమంలో అర్చ కులు వికాస తరంగిణి భక్తులు, పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ వేణుగోపాలస్వామి ఆలయ పూజల్లో పాల్గొన్న భక్తులు, అధికారులు

● హుజూర్‌నగర్, సూర్యాపేటటౌన్, మేళ్లచెర్వు, నేరేడుచర్ల (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని పురాతనమైన వేణుగోపాల-సీతారామచంద్ర స్వామి, జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర వేణుగోపాలస్వామి, మేళ్లచెర్వు భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి నేరేడుచర్ల లోని కోదండ రామాలయాల్లో సోమవారం ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ, అఖండ దీప ప్రజ్వలన తదితర పూజలు నిర్వహించారు. వేణుగోపాల స్వామి, గోదాదేవి అమ్మవారిని పట్టు వస్త్రాలు, పూలమాలలు, తులసిమాలలతో అలంకరించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, మామిడితోరణాలతో అలంకరించారు.



నల్లగొండ పట్టణంలోని రామాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

యాదగిరి క్షేత్రంలో ..

భువనగిరి అర్బన్ (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో సోమవారం వేకువజామున ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ధనుర్మాస వేడుకలకు శ్రీకారం చుట్టారు. రంగనాథుడిని పరిణయమాడేందుకు గోదాదేవి ఆచ రించిన వ్రతాన్ని అర్చకులు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. ఆల య ముఖ మండపంలో ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేక అలం కరణలో తీర్చిదిద్ది వేదికపై అధిష్ఠింపజేశారు. తొలి పాశుర పఠనంతో ధనుర్మాస వేడుకలను ప్రారంభిం చారు. వైభవంగా సాగిన వేడుకల్లో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని హార తి నివేదించారు. వ్రతంలో స్వామికి నివేదించిన పొంగలి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

శివకేశవులకు విశేష పూజలు

స్వామివారి ఆలయంలో శివకేశవులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. ప్రధానాలయంలో స్వయంభువులైన స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలిం గేశ్వరస్వామివారి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషే కించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు విష్వ క్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్ర నామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభా గాల ద్వారా రూ.27,28,872 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.



యాదగిరిగుట్ట ప్రధానాలయంలో పూజలు నిర్వహిస్తున్న పూజారి

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

గుర్రంపోడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు గుర్రంపోడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు 22 మంది విద్యార్థులు ఎంపి కైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాగిణి, పీఈటీ సత్యనారాయణ తెలిపారు. ఈనెల 14న మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు హాజరై పురుషుల విభాగంలో 11 మంది, మహిళల విభాగంలో 11 మంది మొత్తం 22 మంది విద్యార్థులు ఎంపికై నట్లు వారు తెలిపారు. ఎంపికైన వారిని ప్రిన్సిపల్ రాగిణి, పీఈటీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన గుర్రంపోడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ఏపీజీవీబీ ఇక నుంచి టీజీబీ..



కేతేపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు నాగార్జున గ్రామీణ వికాస్ బ్యాంకుగా పేరొందిన(ఎన్‌జీబీ) 20ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ)గా మారింది. 20 ఏళ్ల ప్రస్థానం కొనసాగించిన ఏపీజీవీబీ కాస్త ఇప్పుడు తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో విలీనం కానున్నది. ఇన్నాళ్లూ వరంగల్ ప్రధాన కార్యాలయంగా సేవలు అందిస్తూ వస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)గా అవతరించనుంది. మన వాళ్లతో మన బంధాలను మరింత పెంచుతూ 2025ప్రారంభం నుంచి ఏపీజీవీబీ తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించనుం ది. హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఉన్న టీజీబీలో ఏపీజీవీబీ విలీన ప్రక్రియ ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోంది. ఈ ప్రక్రియ నెలాఖరుకు పూర్తికానుంది. బ్యాంకుల విలీనం సందర్భంగా ఈ నెల 28-31వరకు బ్యాంకు సేవలు నిలిచి పోతాయని ఏపీజీవీబీ అధికారులు పేర్కొంటున్నారు. టీజీబీగా అవతరించి 2025జనవరి 1నుంచి పూర్తి స్థాయిలో బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని చెపుతున్నారు.

ఈనెల 28 నుంచి 31 వరకు సేవలకు అంతరాయం

దామరచర్ల, మర్రిగూడ (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం(డీఎఫ్ఎస్) వారి ఆదేశానుసారంగా ఏపీజీవీబీని జనవరి 1, 2025 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేయబడుతున్నాయని లెంకలపల్లి, మర్రిగూడ దామరచర్ల బ్రాంచీ మేనేజర్లు జగదీశ్వర్‌రెడ్డి, దేవేందర్, ఉపేంద్రబాబు వేర్వేరుగా తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఈ క్రమంలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా ఈనెల 28 నుంచి 31వరకు నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఫోన్ పే, గూగుల్ పే, ఏటీఎం సేవలు అందుబాటులో ఉండవన్నారు. ఖాతాదారులు ఈనెల 27లోపు పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జనవరి 1నుంచి సేవలు వినియోగంలోకి వస్తాయన్నారు. ఖాతాదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని, తమ అకౌంట్ నంబర్లు అదేవిధంగా కొనసాగుతాయని వివరించారు.

నల్లగొండ

నకిరేకల్ - మునుగోడు

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక


కేతేపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన 301 బూత్ కమిటీ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బొజ్జ సుధాకర్ ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, క్రియాశీల సభ్యత్వ ఇన్‌చార్జి మండల వెంకన్న సమక్షంలో సోమవారం నిర్వహించిన ఎన్నికలో సుధాకర్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి, నాయకులు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఎ.అనిత, బి.సతీష్, పిట్టల వెంకన్న, జి.కృష్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

'అంగడి స్థలాన్ని అంగుళం కూడా వదులుకోం'

నార్కట్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని అంగడి స్థలాన్ని అంగుళం కూడా వదులుకోమని రాష్ట్రీయ శివాజీ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తాడోజు శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ కంఠమైన అంగడి స్థలాన్ని వక్ఫ్‌బోర్డు తమదంటూ ఆక్రమించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. రాజకీయ నాయకులు కూడా మౌనం వీడి గ్రామ కంఠంగా అన్ని ఆధారాలున్న స్థలాన్ని కాపాడాలని కోరారు. గ్రామ కంఠం భూమిగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు గ్రామ పంచాయతీ అధికారుల వద్ద ఉన్నా స్వాధీనం చేసుకోవడంలో ఉదాసీనత చూపుతున్నారని అన్నారు. దీనివల్ల ఘర్షణలకు కారణమవుతుందని ఆరోపించారు. సున్నితమైన ఈ సమస్య పెద్దది కాకముందే అధికారులు ఓ పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

తెరపైకి అమ్మనబోలు

▸▸ కొత్త మండలాలను ప్రజా పరిషత్‌లుగా గుర్తిస్తూ జీవో ▸▸ చర్చకు తెరలేపిన అమ్మనబోలు మండల డిమాండ్



నార్కట్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలును నూతన మండలంగా ఏర్పాటు చేసే చర్చ మళ్లీ మొదలైంది. గత బీఆర్ఎస్ పాలనలో నూతనంగా ఏర్పడిన మండలాలను ప్రజా పరిషత్‌లుగా గుర్తిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా జీవో జారీ చేసింది. స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలోనే మండలాలుగా ఏర్పాటైన వాటిని ప్రజా పరిషత్‌లుగా గుర్తించాల్సి వచ్చింది. కేవలం కొత్త మండలాలను ఏర్పరిచిన గత ప్రభుత్వం వాటికి ప్రజా పరిషత్‌ల హోదా ఇవ్వలేదు. ప్రజా పరిషత్‌లుగా గుర్తిస్తేనే ఆయా మండలాలకు ఎంపీటీసీలు, జడ్పీటీసీల స్థానాల కేటాయింపు రిజర్వేషన్లు చేయాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం జారీ చేసిన తాజా జీవోతో అమ్మనబోలు నూతన మండల ఏర్పాటు చర్చ మళ్లీ పురుడు పోసుకుంటోంది.

200 రోజుల పాటు రిలే దీక్షలు

అమ్మనబోలును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ పార్టీ నేత బద్దం వరలక్ష్మీ రాంరెడ్డి, కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యుడు కొంపల్లి సైదులు ఆధ్వర్యంలో సుమారు 200రోజుల పాటు రిలే దీక్షలను చేశారు. వీరికి అన్ని పార్టీలు కూడా మద్దతిచ్చాయి. అమ్మనబోలు మండలంగా ఏర్పాటైతే అందులో చేరేందుకు తొలుత ఆసక్తి చూపిన 13 గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులతో దీక్షలు కొనసాగి ప్రభుత్వానికి తమ డిమాండ్‌ను వివిధ రూపాల్లో బలంగా తెలియజెప్పారు.

అమ్మనబోలును నూతన మండలంగా ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత, ఏర్పాటు చేస్తే పార్టీ పరంగా చేకూరే ప్రయోజనాలపై అప్పట్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విస్తృతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసుకున్నారు. అమ్మనబోలు మండల ఏర్పాటుకు ఇదే మండలానికి చెందిన జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ప్రస్తుత ప్రెస్ అకాడమీ చైర్మన్ కల్మెకొలను శ్రీనివాస్‌రెడ్డి కూడా తోడ్పాటు అందించారు. దీంతో చిరుమర్తి విజ్ఞప్తి మేరకు అప్పటి మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి చొరవతో 5 రెవెన్యూ గ్రామాలు అమ్మనబోలు, కుంకుడుపాముల, తుర్కపల్లి, సూరారం, ఉప్పలంచ (పల్లెపహాడ్, బెండల్‌పహాడ్, రామాంజపురం గ్రామాలు) తో కూడిన నూతన మండల ఏర్పాటుకు 27-09-2023న ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే నోటిఫికేషన్ జారీ తేదీ నాటి నుంచి 15 రోజుల్లోగా అభ్యంతరాలు చెప్పాలనే నిబంధన ఉండగానే అది ముగిసేలోగానే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి మండల ఏర్పాటు ప్రక్రియకు బ్రేక్ పడింది. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అమ్మనబోలు మండల ఏర్పాటు ప్రస్తావన చాలా రోజుల పాటు సద్దుమణిగింది.

కాంగ్రెస్ హామీ నెరవేర్చేనా?:

అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో అమ్మనబోలు మండల ఏర్పాటు అంశం అన్ని ప్రధాన పార్టీలకు రాజకీయ ప్రచారాస్త్రంగా మారింది. ఎన్నికల కోడ్ అమలులోకి రాకపోతే కొత్త మండలంగా అమ్మనబోలు ఏర్పాటయ్యేదని మళ్లీ గెలిచి అధికారంలోకి రాగానే గెజిట్ విడుదల చేస్తామని బీఆర్ఎస్ నేత లు ప్రకటించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా విమర్శలు గుప్పించారు. అమ్మనబోలు మండల ఏర్పాటుపై బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలు సమీపిస్తున్నాయని తెలిసి కూడా ఈ ప్రక్రియను ముందే ఎందుకు చేయలేకపోయిందని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. నోటిఫికేషన్ల పేరు తో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీఆర్ఎస్ నేతలు ఆడిన డ్రామాలో భాగమని వేముల వీరేశం తన ప్రచార పర్యటనలో ఆరోపించారు. తాను గెలిచి కాంగ్రెస్ ప్ర భుత్వం రాగానే అమ్మనబోలు నూతన మండలాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం కొత్త మండలాలను ప్రజాపరిషత్‌లుగా గుర్తిస్తూ జారీ చేసిన జీవో నేపథ్యంలో అమ్మనబోలు మండల ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.



మండలాన్ని ఏర్పాటు చేయాలి



అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజల విన్నపాన్ని మన్నించి అమ్మనబోలును నూతన మండలంగా ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే వీరేశం చొరవ చూపాలి. గత ప్రభుత్వంలో ప్రాథమిక నోటిఫికేషన్ వరకు వచ్చి ఎన్నికల కారణంగా నిలిచిపోయిన ప్రక్రియను వేగవంతం చేసి మండల ఏర్పాటుకు కృషి చేయాలి. మండల ఏర్పాటు విషయంలో రాజకీయాలకతీతంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. లేదంటే మండల సాధన సమితి ఆధ్వర్యంలో కార్యాచరణ సిద్ధం చేస్తాం.

- కొమ్ము గిరి, బీఆర్ఎస్ నాయకుడు, అమ్మనబోలు

ఎమ్మెల్యే సానుకూలంగా ఉన్నారు



అమ్మనబోలును నూతన మండలంగా ఏర్పాటు చేసే విషయంలో ఎమ్మెల్యే వీరేశం సానుకూలంగానే ఉన్నారు. ఈ విషయమై ఇటీవలే పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశాం. ప్రస్తుతం 6 గ్యారెంటీల అమలుపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఈ కారణంగా అమ్మనబోలు మండల ఏర్పాటు ప్రక్రియలో కొంత జాప్యం జరగవచ్చని పేర్కొన్నారు.

- సైదులు, మాజీ ఎంపీటీసీ, అమ్మనబోలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

సంతోష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్



జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వాన్ని ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ రంగానికి ఎప్పటికప్పుడు విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నాం.

- (నల్లగొండ టౌన్, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: నిరంతర విద్యుత్ సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఈ: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించి నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఓవర్ లోడ్ ఉన్న చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. లూజ్‌లైన్, లూప్‌లైన్ స్థానంలో ఇంటర్మీడియల్ పోల్స్ వేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గృహజ్యోతి పథకం ద్వారా ఎంత మంది లబ్ధి పొందుతున్నారు?

డీఈ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా డివిజన్ పరిధిలో 1,13,857 మంది వినియోగదారులు జీరోబిల్లు లబ్ధి పొందుతున్నారు. మరికొంత మందికి చిన్న తప్పిదాలతో పథకం అమలుకావడం లేదు. వారి వివరాలు సంబంధిత ఏఈలకు పంపించాం. దీనికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది.

ఆంధ్రజ్యోతి: వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌ని ఎలా తగ్గిస్తారు?

డీఈ: వచ్చే యాసంగి సీజన్ నాటికి వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా అవసరం ఉన్నచోట కెపాసిటీని పెంచేందుకు హైకెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వ్యవసాయ కనెక్షన్ మంజూరులో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి?

డీఈ: అలాంటిది ఏమిలేదు. ఎప్పటికప్పుడు కనెక్షన్లను విడుదల చేయడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మాణం చేస్తున్నారా?

డీఈ: ఇటీవల కొత్తగా కొన్నిచోట్ల మంజూరైన సబ్‌స్టేషన్లను మంత్రి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. వాటికి సంబంధించిన పనులు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయి. యాసంగికి వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

మోడల్ స్కూల్ టీచర్లకు పదోన్నతులను కల్పించాలి

శాలిగౌరారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని వల్లాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సోమవారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మోడల్ ఉపాధ్యాయులకు దీర్ఘకాలికంగా పదోన్నతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని, కొత్త నోటిఫికేషన్ ద్వారా మోడల్ స్కూల్‌లో నూతనంగా ఉపాధ్యాయులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఎంటీఏ టీఎస్ రాష్ట్ర కన్వీనర్ కుక్కడపు శ్రీనివాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ, సంపత్ కుమార్, కృష్ణయ్య, సంధ్యారాణి, సృజన, సంధ్య, అనురాధ, శ్రీరాములు, అంజనేయులు, రాధ, సహన తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న మూసీ గురుకుల పాఠశాల విద్యార్థి

● *ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసిన వైద్యులు*



సాయిగణేష్

కేతేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూసీ గురుకుల పాఠశాల విద్యార్థి నీలం సాయిగణేష్ ఆరోగ్యం పూర్తిగా కోలుకుంది. దీంతో ఆసుపత్రి వైద్యులు సాయిగణేష్‌ను సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మూసీ బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి నీలం సాయిగణేష్ ఈ నెల 12న సాయంత్రం వాష్‌రూంకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో కాలు నుంచి రక్తం వస్తుండటంతో పాము కరిచినట్లు భావించి అనుమానంతో ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజుల చికిత్స తర్వాత సాయిగణేష్ ఆరోగ్యం పూర్తిగా కోలుకోవడంతో సోమవారం వైద్యులు డిశ్చార్జి చేశారు. ఒడిశాలో కల్లుగీత వృత్తికి వలస వెళ్లిన విద్యార్థి తల్లిదండ్రులు నీలం యాదగిరి, జానకమ్మ, ఇతర బం ధువులు సోమవారం నీలోఫర్ ఆసుపత్రి నుంచి సాయిగణేష్‌ను తీసుకుని స్వ గ్రామం కట్టంగూరు మండలంలోని అయిటిపాములకు చేరుకున్నారు. మరో రెండు రోజుల తర్వాత సాయిగణేష్‌ను తిరిగి పాఠశాలకు పంపిస్తామని తల్లిదండ్రులు తెలిపారు.

సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలి



మర్రిగూడ : బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కనగల్, మర్రిగూడ, డిసెంబరు 16: (ఆంధ్రజ్యోతి) సీపీఐ శతాబ్ది వేడుకల్లో భాగంగా నల్లగొండలో ఈ నెల 30వ తేదీన జరిగే సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, నాయకుడు బూడిద సురేష్ అన్నారు. కనగల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో బహిరంగ సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేస్తూనే ఉందని అన్నారు. పార్టీ ఏర్పాటై 100 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30వ తేదీన నల్లగొండ పట్టణంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కనగల్‌లో నిర్వహించిన సమావేశంలో వీరస్వామి మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా ఈనెల 26న గ్రామా ల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ నాయకులు దోటి పాండరి, జోగు సురేందర్, తొరకొప్పుల నాగరాజు పాల్గొన్నారు.

మర్రిగూడ మండలంలోని ఖుదాభక్షపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో సురేష్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

డిప్యుటేషన్‌పై పంపింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇళ్లు లేని పేదలకు ఇంటిని నిర్మించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆ శాఖను మళ్లీ పునరుద్ధరించింది. ప్రస్తుత గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో సర్వే సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టినా అవి అరకొరగా ఉండటంతో చాలా ప్రాంతాల్లో వాటిని లబ్ధిదారులకు కేటాయించని పరిస్థితి ఉంది. దీంతో అప్పట్లో ప్రభుత్వంపై విమర్శలు వెలువెత్తాయి. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే సకాలంలో పూర్తవుతుందా? లేక ఆటంకాలు ఎదురవుతాయా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పని ఒత్తిడి, సాంకేతిక సమస్యలతో సర్వే వేగవంతంగా ఎలా పూర్తవుతుందని సర్వేయర్లు ప్రశ్నిస్తున్నారు. కొద్ది రోజుల వరకు కుటుంబ సమగ్ర సర్వే నిర్వహించిన వారే మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులు చేస్తుండటంతో వారిపై పని భారం పడుతోంది. పలుచోట్ల యాప్‌లో వివరాలు నమోదు చేసిన సమయంలో సర్వర్ డౌన్ అవుతుండటంతో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య తలెత్తుతోంది.

సకాలంలో సర్వే పూర్తి చేస్తాం : రాజ్‌కుమార్, గృహ నిర్మాణ సంస్థ పీడీ

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతంగా సాగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న అధికారులు, ఉద్యోగులు సర్వేను వేగవంతం చేశారు. ప్రస్తుతం 40వేల ఇళ్ల దరఖాస్తుల సర్వే పూర్తి చేసి 33వేల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తున్నాం.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● *సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి*



డీఈవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర కమిటీ పిలుపు మే రకు సోమవారం డీఈవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు, గుడ్ల బిల్లులు నెలల తరబడి రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెట్టుబడి పెట్టాల్సి రావడంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చేసిన వాటికి బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంటే పైగా రాగిజావ పోయాలని, వారంలో మూడు సార్లు గుడ్లు పెట్టాలని ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు విడుదల చేయకుండా వంట చేయడం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిని వినతిపత్రం డీఈవో కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అద్దంకి నరసింహ, అవుట రవీందర్, వరికుప్పల ముత్యాలు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే. కరీమున్నీసా, ఉపాధ్యక్షులు పాను గంటి లక్ష్మమ్మ, చింత సంగీత, నాయకులు అల్లి అనురాధ, మేడి హంస, వట్టికోటి అంజమ్మ మంగ, దమయంతి, మాచర్ల యాదమ్మ, వెంకటమ్మ, ఇందిర, పుష్పలత, సునీత, కిష్టమ్మ, విజయ, శ్రీలత, నిర్మల, గణేష్, సైదమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను

లబ్ధిదారులకు అప్పగించాలి

● *సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య*



కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు

నల్లగొండటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో లాటరీ ద్వారా ఎంపిక చేయబడిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను అప్పగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్వాధీనం చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిధులు కేటాయించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ 2017లో అప్పటి ప్రభుత్వం పట్టణంలో ఇల్లు లేని పేదల కోసం 552 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిందని అన్నారు. 2023 జూలైలో ఇల్లు లేని పేదలందరనీ విచారణ చేసి డ్రా ద్వారా అర్హులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కానీ వారికి ఇప్పటి వరకు వారికి స్వాధీనం చేయలేదని అన్నారు.

కలెక్టర్ జోక్యం చేసుకొని డబుల్ బెడ్‌రూం ఇల్లు సందర్శించాలని, మౌలిక సదుపాయాలు కల్పించి ఎంపికైన లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, కోట్ల అశోక్ రెడ్డి, గాదే నరసింహ, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్, ఊట్కూరి మధుసూదన్ రెడ్డి, గంజి నాగరాజు, లబ్ధిదారులు లతీఫ్, లక్ష్మమ్మ, గుండ్ల స్వరూప, యాదమ్మ, సంతోష్, రూన్సీ, సుల్తాన్, అలివేలు, జహంగీర్, గణేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తిలో సమస్యల తిష్ఠ

● *కనీస వసతులు లేక ప్రజల అవస్థలు* ● *రోడ్డుపైనే ప్రయాణికుల పాట్లు*



తిప్పర్తిలో ప్రమాదకంగా రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

తిప్పర్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిప్పర్తి మండల కేంద్రంలో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అద్దంకి - నార్కట్‌పల్లి ప్రధాన హైవేపై నల్లగొండ జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండే తిప్పర్తి మండల ప్రజలకు అభివృద్ధి కోసం ఎదురుచూపులే మిగిలాయి. తిప్పర్తి మండల పరిధిలో 26 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి రోజు సుమారు 10 నుంచి 15 వేల మంది ప్రజలు వారి పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తూ ఉంటారు. దీంతో పాటు నకిరేకల్, మిర్యాలగూడెం, నల్లగొండ పట్టణ కేంద్రాలకు వెళ్లడానికి ప్రయాణికులు ఉంటారు. ప్రతీ శుక్రవారం జరిగే సంతకు కూడా అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం కనీస వసతులైన మూత్రశాలలు లేవు. ప్రయాణికులకు కూర్చునేందుకు వీలుగా ప్రాంగణం లేదు. మండల కేంద్రానికి పనుల నిమిత్తం వచ్చే మహిళలు మూత్రశాలల సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మండల కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. మండలకేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ చలికి వణుకుతూ రోడ్డుపైనే నిల్చోవాల్సిన పరిస్థితి. వెంటనే సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. తిప్పర్తి మండల కేంద్రంలో నిత్యం ప్రయాణికుల రాకపోకలు ఉండటం వల్ల బస్టాండ్‌తో పాటు మూత్రశాలలు, తాగునీరు సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు

అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు. అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులు రాలేదు.

● పి. శ్రీనివాస్, పీఆర్ఏఈ

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కేతేపల్లిలో వీధిలైట్లను ఆవిష్కరిస్తున్న మార్కెట్ డైరెక్టర్లు ముత్తయ్య, పరశురాములు

కేతేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బయ్య ముత్తయ్య, ఎం.పరశురాములు అన్నారు. మండల కేంద్రం కేతేపల్లికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసిన రూ.5లక్షల విలువైన వీధి దీపాలను సోమవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం, దేశ అభివృద్ధి ముడిపడి ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఆదినుంచి భావిస్తుందన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జటంగి ముత్తమ్మ, కాంగ్రెస్ నాయకులు జె.వెంకటనర్సయ్యయాదవ్, ఎ.మహేందర్‌రెడ్డి, అయితగోని వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలు



శాలిగౌరారంలో కేక్ కట్ చేస్తున్న వెంకన్నగౌడ్, హతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

శాలిగౌరారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు కట్ట వెంకట్‌రెడ్డి, అక్కినపల్లి శ్రీరాములు, బాకీ వెంకన్న, పనికర కమలాకర్, రాచకొండ గణేష్, నూనెముంతల ఆంజనేయులు, నిమ్మల సురేష్, గోదల సురేష్‌రెడ్డి, రాజు, మాగి రవి, అంజయ్య, రవి, బట్ట చిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య కీర్తనలు

నల్లగొండకల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితి నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమం ప్రేక్షకులను అలరింపజేసింది. గాయకురాలు సీతా గాయత్రి ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో రామచంద్రమూర్తి, పురుషోత్తమ చార్యులు, వాయిద్య కళాకారులు లక్ష్మీనారాయణ, భిక్షం, మాధవి పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ జాతర

చందంపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మహాలక్ష్మమ్మ జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీర్వాదం అందరిపై ఉండాలని, పాడిపంటలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బద్యానాయక్, సర్వయ్య, సిరాజ్‌ఖాన్, శ్రీను, పార్వతీచందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 86

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.128	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 । కనిష్ఠం 16.0



ధనుర్మాసం ఆరంభం

ధనుర్మాస వేడుకలు సోమవారం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. పలు దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు తొలి పాశుర పఠనం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి హారతి నివేదించారు. 7



పరీక్షా సమయం

జిల్లాలో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెండో రోజు సోమవారం 600 కేంద్రాల్లో అధికారులు పరీక్ష నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. 7



ఆందోళనా పథం

సర్వ శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఉద్యోగ భద్రత కల్పించాలని నిర్వహిస్తున్న సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. రోజూ పలు రూపాల్లో వీరు ఆందోళన నిర్వహిస్తున్నారు. సోమవారం చెవిలో పువ్వుతో సమగ్ర శిక్షకులు నిరసన తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

- జిల్లాలో మొత్తం దరఖాస్తులు 4.31లక్షలు
- ఇప్పటి వరకు 40వేల దరఖాస్తుల పరిశీలన
- 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్

పేదలకు సొంతింటి కల నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని శ్రీకారం చుట్టింది. గతంలోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించగా, ప్రత్యేక యాప్‌ను రూపొందించి లబ్ధిదారుల ఎంపికకు సర్వే ప్రారంభించింది. జిల్లాలో మొత్తం 4,31,831మంది దరఖాస్తు చేయగా, ఇప్పటికే 40వేల దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. అందులో 33వేల దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఎప్పటికప్పుడూ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు కలెక్టర్ ఇలాత్రిపాఠి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతీ 500 దరఖాస్తుదారులకు ఒక సర్వేయర్ నియమించారు. ఒక్కో సర్వేయర్ రోజుకు కనీసం 20 దరఖాస్తుల సర్వే పూర్తి చేయాలి. మునిసిపాలిటీల్లో సర్వేయర్‌లుగా వార్డు అధికారి, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ కార్యదర్శి, ఉపాధి సిబ్బందిని నియమించారు. నెలాఖరులోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామాలు, వార్డుల్లో సర్వే సమాచారాన్ని అధికారులు ప్రజలకు ఒక రోజు ముందుగానే ఇస్తారు. అధికారులు వచ్చినప్పుడు దరఖాస్తుదారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పూర్తి వివరాలు అందజేయాలి. ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, సఫాయి కార్మికులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. దరఖాస్తుదారులు ఉంటున్నది సొంత ఇల్లా లేక అద్దె ఇల్లా అనేది మూడు ఫొటోల చొప్పున తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మొదటి విడతలో స్థలం ఉండి ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివాసం ఉంటున్న వారికి మంజూరు చేయనున్నారు. కాగా, 11 నెలల క్రితం దరఖాస్తు చేసుకున్న అర్హులు ఇంటి కోసం ఎదురుచూస్తున్నారు.

యాప్‌లో ఏడు ప్రశ్నలకు వివరాల నమోదు..

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సుమారు ఏడు ప్రశ్నలు ఉన్నాయి.భూమి ఉందా? ఏం చేస్తుంటారు? కుటుంబ సభ్యుల సంఖ్య? వంటి ప్రశ్నలతో పాటు ఇతర వివరాలు అడిగి నమోదు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా క్షేత్రస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి అర్హులను గుర్తిస్తారు. ప్రతీ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహనిర్మాణ శాఖను రద్దు చేయగా, ఆశాఖలోని ఉద్యోగులను ఇతర శాఖలకు...

- మిగతా 8వ పేజీలో...

గుడ్డు ప్రియులకు గడ్డుకాలం

- రూ.7కు పైగా పెరిగిన ధర
- క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు కేక్‌ల తయారీ కోసం అధికంగా వినియోగం
- కొంత కృత్రిమ కొరత
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కోడిగుడ్డు ధర కొండెక్కింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రిటైల్ ధర రూ.7కు పైగా చేరింది. చలికాలంలో ధర పెరగడం సాధారణమే. అయినా ఇంత స్థాయిలో పెరగడం అరుదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరాంతంలో క్రిస్మస్, ఆంగ్ల సంవత్సర వేడుకలు ఉన్నాయి. ఈ ఉత్సవాలకు అధికంగా వినియోగించే కేకుల తయారీలో గుడ్డు వాడకం ఎక్కువ. దీంతో ధర మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే కిరాణా దుకాణాల్లో రూ.7.50 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో గుడ్డు వినియోగం పెరిగింది. మరో పక్క కార్తీక మాసానికి ముందు కోడి మాంసం కిలో ధర రూ.230 నుంచి రూ.240 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200 వరకు ఉంది. మాంసం ధర తగ్గి, గుడ్డు ధర మాత్రం విపరీతంగా పెరిగింది. నెలాఖరుకు మాంసం ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేటటౌన్)

గుడ్డు ధర రోజురోజుకూ పెరుగుతోంది. గత నెల క్రితం డజన్ గుడ్లు రూ.72 ఉండగా, ప్రస్తుతం రూ.90కి పైగా చేరింది. సూర్యాపేట జిల్లాలో నిత్యం 4.50లక్ష నుంచి 5.20లక్షల వరకు గుడ్ల విక్రయం జరుగుతోంది. పట్టణంలో నిత్యం 60వేల నుంచి 80వేల వరకు విక్రయిస్తున్నారు. గతంలో రోజంతా విక్రయించే గుడ్లు ఇప్పుడు కేవలం మూడు గంటల్లోనే విక్రయించడం గమనార్హం. పౌష్టికాహారంగా గుడ్డు తీసుకోవాలని ప్రచారం చేయడం, ప్రజల్లో అవగాహన పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణం. ఒక కుటుంబం వారంలో ఒక రోజు మాంసాన్ని విక్రయిస్తే కొందరు ప్రతీ రోజు గుడ్డును వినియోగిస్తున్నారు. జిల్లాలో 10కి పైగా కోళ్లఫాంలు ఉన్నాయి.అందులో 8లక్షలకుపైగా కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో సుమారు 3లక్షల నుంచి 4లక్షలవరకు విజయవాడ,గుంటూరుతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి.

కేకుల కోసం ఆర్డర్లు..

సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఒక బేకరీ నిర్వహకుడు డిసెంబరు 31 వేడుకను దృష్టిలో ఉంచుకొని కొద్ది రోజుల నుంచి కేకుల తయారీలో నిమగ్నమయ్యాడు. అందుకోసం సదరు బేకరీ నిర్వాహకుడు ప్రతీరోజు 200పైగా కోడిగుడ్లను ఆర్డర్ ఇస్తున్నాడు. జిల్లా కేంద్రంలో సుమారు 100వరకు బేకరీలు ఉన్నాయి. అంతేగాక క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో కేకుల విక్రయాలు పెరుగుతుండడంతో కోడిగుడ్లకు డిమాండ్ పెరిగింది. అంతేగాక కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల క్రితం హాస్టల్ విద్యార్థులకు నూతన మెనూ ప్రకటించగా, అందులో ప్రతీ రోజు గుడ్లు ఇవ్వాలనే నిబంధన పెట్టింది. దీంతో డిమాండ్ పెరిగింది.

కృత్రిమ కొరత..

గుడ్ల ధరలు ఏటా నవంబరు, డిసెంబరు నెలలో కొంత పెరుగుతాయి. చలి కాలంలో గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. వేసవి కాలంలో గుడ్లు 10 నుంచి 12 రోజుల్లో విక్రయించాలి. అదే చలికాలంలో 20 రోజుల వరకు తాజాగా నే ఉంటాయి. దీంతో కోళ్లఫారం నిర్వాహకులు చలికాలంలో గుడ్లను విక్రయించకుండా...

- మిగతా 6వ పేజీలో...

కోడిగుడ్డు ధర పెరుగుదల ఇలా

నెల	ధర
ఆగస్టు	రూ.5.70
సెప్టెంబరు	రూ.6.25
అక్టోబరు	రూ.6.29
నవంబరు	రూ.6.50
డిసెంబరు	రూ.7.20





గజ గజ

ఈ సీజన్‌లో అతి కనిష్ఠ ఉష్ణోగత్ర 16డిగ్రీలు నమోదు

చలి తీవ్రత తట్టుకోలేక ఆలయ వాచ్‌మన్ మృతి

ఉమ్మడి జిల్లాలో చలి గాలులు విజృంభిస్తున్నాయి. ఈ సీజన్‌లో మొదటిసారి సోమవారం 16.0డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజా వణుకుతున్నారు. శీతాకాలంలో గతానికి భిన్నంగా రోజంతా చలి ఉంటోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

చలి తీవ్రతను తట్టుకోలేక ప్రజలు ప్రత్యామ్నాయం వెతుక్కుంటున్నారు. ప్రధానంగా స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు, ఉన్ని దుస్తులు కొనుగోలుచేస్తున్నారు. అయినా చలి నుంచి తట్టుకోలేకున్నామని వృద్ధులు వాపోతున్నారు. ప్రజలు తెల్లవారుజామున లేచి పనులపై బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి వణికిస్తున్న చలి మరుసటి రోజు ఉదయం 9గంటల వరకు కూడా ఉంటోంది. చలి కారణంగా పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజామున పలు ప్రాంతాల్లో పొగమంచు కమ్ముకుంటుండటంతో రోడ్లపై వాహన రాకపోకలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రజలు పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఉదయం, సాయంత్రం చలిమంట వేసుకుంటూ చలి నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న రెండు రోజులు కూడా ఉమ్మడి జిల్లాలో చలి గాలులు పెరగడంతో పాటు ఉదయం వేళలో పొగమంచు దట్టంగా అలుముకునే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ పేర్కొంటోంది. చలి తీవ్రత తట్టుకోలేక నల్లగొండ పట్టణంలోని తులసీనగర్‌లో ఉన్న హనుమాన్ గుడి వాచ్‌మెన్ చింతకాయల సత్తయ్య (61) మృతి చెందాడు.

ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
12	28.5	19.4
13	29.0	19.0
14	28.0	18.0
15	27.5	17.6
16	27.0	16.0

గ్రీవెన్స్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ శరత్ చంద్రపవార్



బాధితుల నుంచి వినతులు తీసుకొని వారితో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి గ్రీవెన్స్ డే నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారులు కృషి చేయాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30మంది ఫిర్యాదులను ఆయన నేరుగా స్వీకరించారు. వారి సమస్యలను విని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.

బాధితుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా వ్యవహరించి వారి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిశీలించి వేగంగా స్పందించాలని అన్నారు. బాధితులకు న్యాయం చేసి వారికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

క్రీడల్లో జిల్లాకు పేరు తీసుకురావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



క్రీడలను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీల్లో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ, నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను ఆమె సోమవారం జ్యోతి వెలిగించి ప్రా రంభించారు. సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభ సూచకంగా క్రీడా పతకాన్ని ఎగురవేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకే సీఎం కప్ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. అనంతరం మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డితో కలిసి మేకల అభినవ్ స్టేడియాన్ని సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: 'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ప్రజావాణి ఫిర్యాదులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ, మునిసిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖల వద్ద ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఆయా శాఖల అధికారులు ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలన్నారు. నియోజకవర్గాల్లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా విందు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ మేరకు సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కొత్త దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్వో అమరేందర్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యసౌకర్యాలు కల్పించాలి

నల్లగొండ: జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన జాతీయ క్యాన్సర్, మధుమేహం, గుండె నియంత్రణ కేంద్రాల్లో అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ఆమె జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిజిషియన్‌తో పాటు గుండె వైద్య నిపుణులు, అంకాలజిస్ట్ అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, సిటీ స్కాన్, ఎస్ఎన్‌సీయూ ఎమర్జెన్సీ, ఐసీయూ, డయాగ్నస్టిక్, ల్యాబ్ పరీక్షల కేంద్రాలతో పాటు వార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

చెర్వుగట్టు క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్ దంపతులు



నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠిభవేశ్ మిశ్రా దంపతులు సోమవారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ దంపతులకు అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూలవిరాట్టు వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉపాలయాలను దర్శించుకున్నారు. క్షేత్ర విశిష్టతను దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ కలెక్టర్‌కు వివరించగా వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేశారు. ఎండోమెంట్ జిల్లా సహాయ కమిషనర్ సులోచన, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్ స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి మూలవిరాట్ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, రేగట్టె నర్సిరెడ్డి, నేతకాని కృష్ణయ్య, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వారికి హోదా.. వీరికి ఉపాధి

- పెరిగిన సెకండ్‌హ్యాండ్ కార్ల విక్రయాలు
- మధ్యతరగతి, వ్యాపారులు, ఉద్యోగుల్లో పెరిగిన ఆసక్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

సొంత కారు కల పెరిగిన నేపథ్యంలో సెకండ్‌హ్యాండ్ కార్ల కొనుగోళ్లు పెరిగాయి. లాక్‌డౌన్ అనంతరం మధ్యతరగతి, ఉద్యోగుల్లో సొంత కారు ఉండాలనే ఆలోచన పెరిగింది. రూ.2లక్షల కనీస బడ్జెట్ నుంచి రూ.5లక్షల పరిమితితో సెకండ్‌హ్యాండ్ కార్లు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. దీంతో బస్సు ప్రయాణాలకు బదులు సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోలుకే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. దీంతో జిల్లాలోని పలు పట్టణాల్లో సెకండ్ హ్యాండ్ కార్ల ప్రత్యేక కన్సల్టెన్సీలు పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా కొందరికి జీవనోపాధి లభిస్తుండగా, అటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు, వాహనాలు లభిస్తున్నాయి.

6

అంబులెన్స్‌కు దారేదీ?

» మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలో రోడ్లకు ఇరువైపులా వాహనాల పార్కింగ్ » సెల్లార్లలో స్కానింగ్, డయాగ్నస్టిక్ కేంద్రాలు



మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీ వాసులు తీవ్ర ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వైద్యం కోసం వచ్చే రోగులు, క్షతగాత్రులను తరలిం చేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బాధిత రోగుల సహాయకులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకుంటూ అంబు లెన్స్‌ను ఆస్పత్రి వద్దకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి ఎదురవుతున్న ఈ సమస్యకు అధికారులు, ఆస్పత్రి నిర్వాహకులు పరిష్కారం చూపలేకపోతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ అర్బన్)

డాక్టర్స్‌కాలనీలో సుమారు 128 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా అందులో చాలా వరకు అద్దె భవనాలే ఉన్నాయి. అయితే బహుళ అంతస్థు భవనాల్లో వాహనాల పార్కింగ్ కోసం వదిలిన సెల్లార్లను సైతం ఆస్పత్రులు తమ అవసరాలకు వినియోగి స్తున్నారు. ప్రతి ఆస్పత్రి యాజమాన్యం సెల్లార్లలో డయాగ్నస్టిక్ ల్యాబ్, మెడికల్‌షాపు, స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు తమ వాహనాల ను డాక్టర్స్ కాలనీ రోడ్లకు ఇరువైపులా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. భవనాల యజమానులు కిరాయికి ఆశపడి సెల్లార్ల ఖాళీ ప్రదేశాల్లో షట్ట ర్లు ఏర్పాటుచేసి ఇతర వైద్యావసరాలకు అద్దెకిచ్చి ఆదాయం పొందుతుండగా, ఇక్కడికి వచ్చే ప్రజలు మాత్రం ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఇరక్కు పోయి అవస్థలు పడుతున్నారు.

సమస్యకు పరిష్కారం చూపాలి.



రోగులు, క్షతగాత్రులను అత్యవసర వైద్యం కోసం మెరుగైన సదుపాయాలు కలిగిన ప్రైవేటు ఆస్పత్రి చేరవేయాలంటే ఇబ్బందిగా ఉంది. రోడ్లకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేయడంతో అంబులెన్స్ వెళ్లేందుకు దారి దొర కడం లేదు. ఆస్పత్రుల సెల్లారను ఉపయోగించడంలోనే ఈ సమస్య వస్తోంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి.

- పి. శ్రీనివాస్ (అంబులెన్స్ డ్రైవర్, మిర్యాలగూడ)

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి



ఆస్పత్రుల వద్ద వాహనాల పార్కింగ్‌తో డాక్టర్స్‌కాలనీలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. దీన్ని పరిష్కరిం చేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రుల నిర్వాహకులు తమ ఆస్పత్రికొచ్చే వాహనాలను నిలు పుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించాం. ఐఎంఏ ప్రతినిధులు వారం రోజుల గడువు కోరారు. సమస్య పరిష్కారానికి సహకారం అందించకపోతే చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారమయ్యేనా.?

డాక్టర్స్‌కాలనీలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య, ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజలు ఎమ్మెల్యే బీఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఈనెల 14న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులతోపాటు పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. డాక్టర్స్‌కాలనీలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. నిర్వాహకులు తమ ఆస్పత్రుల వద్దకు వచ్చే వాహనాలను నిలిపేందుకు స్థలం కేటాయించుకోవాలని, ఆస్పత్రి సెక్యూరిటీగార్డులతో ట్రాఫిక్ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. డాక్టర్స్‌కాలనీలో ఏర్పడ్డ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని లేని పక్షంలో శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకునే విధంగా రెవెన్యూ, మునిసిపల్, పోలీస్‌శాఖలకు ఆదేశాలు జారీచేస్తామంటూ హెచ్చరించారు. దీంతో ఐఎంఏ ప్రతినిధులు సమస్యను పరిష్కరించుకునేందుకు వారం రోజులు గడువు కోరారు. ఎమ్మెల్యే చొరవతోనైనా సమస్యకు పరిష్కారం లభించవచ్చన్న ఆశాభావంతో ప్రజలు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సారా తయారు చేస్తే పీడీయాక్ట్

● మిర్యాలగూడ ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి



కృష్ణపట్టె ప్రాంతాలు, మిర్యాలగూడ మండలంలోని పలు గ్రామాల్లో సారా నియంత్రణకు ప్రత్యేక నిఘా పెట్టామని, సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ఎవ్వరైనా తమ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

(మిర్యాలగూడ అర్బన్ -ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి : ఈ ఏడాది ఎన్ని కేసులు నమోదయ్యాయి..?

ఎక్సైజ్ సీఐ: మిర్యాలగూడ ఎక్సైజ్ పరిధిలో ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు తమ స్టేషన్ పరిధిలో 244 అక్రమ మద్యం కేసులు నమోదు కాగా, 120 మందిని బైండోవర్ చేశాం. సారా తయారీ చేస్తున్న ఆరుగురు వ్యక్తులకు రూ.4.85లక్షల జరిమానా విధించాం.

ఆంధ్రజ్యోతి: మద్యం కల్తీని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎక్సైజ్ సీఐ: మద్యం కల్తీ చేస్తే క్రిమినల్ కేసులతోపాటు లైసెన్స్ రద్దుచేస్తామని వ్యాపారులను హెచ్చరించాం. కల్తీమద్యం అరికట్టేందుకు నిఘా పెట్టాం.

ఆంధ్రజ్యోతి: బెల్టుషాపుల జోరుకు బ్రేక్ వేస్తారా..?

ఎక్సైజ్ సీఐ : గ్రామాల్లో బెల్టుషాపులపై. సమాచారం అందిన వెంటనే తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. స్థానికులు సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: మీ పరిధిలో ఎన్ని వైన్స్‌లు ఉన్నాయి.. ప్రతినెల ఎంత మద్యం అమ్ముడుబోతోంది.

ఎక్సైజ్ సీఐ: 26 వైన్స్‌లు, 6 బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి. ప్రతినెల సగటున రూ. 31కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

'కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి'

మిర్యాలగూడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎంసీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ కార్మిక, కర్షకులను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నాని ఆరోపించారు. అనంతరం సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వస్కుల మట్టయ్య, వస్కుల భరత్, ధీరావత్ మోహన్‌నాయక్, వస్కుల సైదమ్మ, కాశీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలతోనే క్రమశిక్షణ : డీఎస్పీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రీడలతో క్రమశిక్షణతోపాటు మంచి నడవడిక లభిస్తుందని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడా పోటీలకు క్రీడాకారుల ఎంపికకు జిల్లాస్థాయి సెలక్షన్‌ను స్థానిక ఎన్నెస్పీ క్యాంపు గ్రౌండ్‌లో సోమ వారం ఆయన జిల్లా డీవైఎస్ఓ నర్సిరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవడంతో యువతలో కృషి, పట్టుదల పెరుగుతుందన్నారు. క్రీడలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఈనెల 18 నుంచి 21 వరకు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చిర్ర మల్లేష్ యాదవ్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవీందర్‌గౌడ్, కౌన్సిలర్ జానీ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బంటు కిరణ్ పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు షురూ

దేవరకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దేవరకొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి భక్తులు పూజలు చేశారు. దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నిర్వాహకులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దామరచర్ల, డిసెంబరు 16(దామరచర్ల): మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కన్వీనర్ బైరం దయానంద్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నేడు (మంగళవారం) తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వాడపల్లి శ్రీరాములు, ఎండీ.జహీర్, సైదులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలతో ఆలోచనా శక్తి

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిభా పరీక్షలతో ఆలోచన శక్తి పెరుగుతుందని ఎంఈవో బాలునాయక్ అన్నారు. గణిత ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు గణిత ఫోరం చేస్తున్న కృషి గొప్ప దన్నారు. విద్యార్థులు మ్యాథ్స్‌పై పట్టు సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం ఫోరం సభ్యు లను అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం ధర్మానాయక్, ఫోరం సభ్యులు ప్రసాద్, సైదిరెడ్డి, శ్రీశైలం, కష్ణకాంతనాయక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో గణిత ఫోరం సభ్యులు



భూమి పుత్రుడు

● 90 ఏళ్ల వయస్సులో భూమిపై మమకారం
● ప్రతిరోజు 3 కిలో మీటర్ల దూరం పొలాల సందర్శన

అతడికి భూమిపై ఎనలేని మమకారం. వయసు 90 ఏళ్లపై మాటే. వయసు పెరగుతున్న కొద్ది అనారోగ్య కారణాలు చుట్టు ముట్టాయి. నాలుగేళ్ల క్రితం వైద్యులు ఆయనకు యూరిన్ బ్యాగ్ అమర్చారు. ఒక చేత్తో బ్యాగ్ పట్టుకుని ఉదయం 7 గంటలకే 2 కిలో మీటర్ల పరిధిలో పొలాల గట్లపై నడుచుకుంటూ పైరును పరిశీలిస్తాడు. తాను కష్టమైన పనులు చేయలేక పోయినప్పటికీ మట్టి మమకారంతో వరిపైరు బాగోగులు పరిశీలించి సాగు చేసే కౌలు దారులకు, తన కుమారుడికి తగు సలహాలు ఇస్తుంటారు. ఆయనే గజ్జెల కోటిరెడ్డి.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)



పొలానికి వచ్చిన కోటిరెడ్డి (ఫైల్)

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని నీలాయిగూడేనికి చెందిన గజ్జెల కోటిరెడ్డికి ఓ కొడుకు, కుమారుడు. తన పూర్వీకులు ఆ గ్రామానికి వలస వచ్చి స్థిరపడ్డారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన 4వ తరగతి వరకు చదువుకున్నారు. .అప్పట్లో అది పెద్ద చదువు కిందే లెక్క. 5 ఎకరాల సొంత భూమి ఉండేది. తండ్రితో పాటు వ్యవసాయానికి దిగాడు. అప్పటి నుంచి వ్యవసాయమే పనిగా పెట్టుకున్నాడు. కరువులోనూ, కాలంలోనూ భూమిని వీడ లేదు. జొన్నలు, సద్దలు, కందులు, మొక్కజొన్న లాంటి వర్షాధార మెట్ట పంటలను సాగు చేశారు. మెల్లగా కృష్ణమ్మ చెంతకు వచ్చి ంది. నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణంతో బీడు భూముల దాహం తీరింది. పంటలకు ప్రాణం వచ్చింది. సాగు తీరు మారింది. పంటల ఉత్పత్తి పెరిగింది. నీటి లభ్యతతో వరి సాగే ప్రధానమైంది. ఇంటిల్లిపాది ఆరుగాలం కష్టానికి ఫలితం దక్కి ంది. కోటిరెడ్డి కుటుంబం రెండు మూడేళ్లకోసారి కొంత కొంతగా భూములను కొనుగోలు చేశారు. 35 ఎకరాలకు భూమిని విస్తరించారు. 5 ఎకరాలు కూతురికి ఇచ్చి వివాహం జరిపించారు. కుమారుడి సంతానంపై చదువుల కోసం విదేశాల బాట పట్టారు. మనుమరాలు యూఎస్‌లో స్థిరపడింది. ఆరు ఎకరాల వరకు కుమారుడు లింగారెడ్డి సాగు చేస్తుండగా మిగతా భూమిని కౌలుదారులకు ఇచ్చారు. కోటిరెడ్డి వయసు పైబడుతున్న కొద్దీ ఆరోగ్యం క్షీణించింది. 10 ఏళ్ల క్రితం ఆయన భార్య మరణించింది. యూరినల్ ఇన్‌ఫెక్షన్ తో బ్యాగ్ ఏర్పాటు చేశారు. ఆరోగ్యం కుదుటపడినప్పటికీ జీవించినంతకాలం యూరిన్ బ్యాగును తొలగించవద్దని వైద్యులు చెప్పడంతో గత నాలుగేళ్లుగా యూరిన్ బ్యాగుతో నడక సాగిస్తున్నాడు. అయినా భూమిపై మమకారం చంప ుకోలేక రోజు 2 కిలోమీటర్ల పరిధి లోని పొలాల చుట్టూ తిరిగి వస్తుంటాడు.

పొలం చూడందే నిద్ర పట్టదు

ఉదయం 5 గంటలకే నిద్రలేస్తా. 7 గంటకు టిఫిన్ చేసి చెరువు కట్టపై నుంచి నడిచి అక్కడి పొలాలు చూసుకుని వాగు దాటి వీర్లబండ బాటకు వస్తా ఇక్కడి పొలాలు చూసు కుంటూ దోమలబండ వద్ద నుంచి మెయిన్ రోడ్డు ఎక్కి 9 గంటల లోపు ఇంటికి చేరుతా. దాదాపుగా ఎప్పుడు ఊళ్లోకి వెళ్లను. పొలం చూడందే నిద్ర పట్టదు. నేను ఏమి చేయలేక పోయినా కంటినిండా పైరు చూసుకుంటే వచ్చే ఆనందమే వేరు. మిగతా సమయంలో భారతం, భాగవతం, రామాయణం లాంటి పుస్తకాలు చదువుతా. శ్లోకాలు చదవడం వచ్చు.

- కోటిరెడ్డి, రైతు

కోలుకున్న మూసీ గురుకుల పాఠశాల విద్యార్థి

● ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసిన వైద్యులు

కేతేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికి త్స పొందుతున్న మూసీ గురుకుల పాఠశాల విద్యార్థి నీలం సాయిగణేష్ ఆరోగ్యం పూర్తిగా కోలుకుంది. దీంతో ఆసుపత్రి వైద్యులు సాయిగణేష్‌ను సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మూసీ బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి నీలం సాయిగణేష్ ఈ నెల 12న సామూహిక యంత్రం వాష్‌రూంకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో కాలు నుంచి రక్తం వస్తుండటంతో పాము కరిచినట్లు భావించి అనుమానంతో ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజుల చికిత్స తర్వాత సాయిగణేష్ ఆరోగ్యం పూర్తిగా కోలుకోవడంతో సోమవారం వైద్యులు డిశ్చార్జి చేశారు. ఒడిశాలో కల్లుగీత వృత్తికి వలస వెళ్లిన విద్యార్థి తల్లిదండ్రులు నీలం యాదగిరి, జానకమ్మ, ఇతర బంధువులు సోమవారం నీలోఫర్ ఆసుపత్రి నుంచి సాయిగణేష్‌ను తీసుకుని స్వ గ్రామం కట్టంగూరు మండలంలోని అయిటిపాములకు చేరుకున్నారు. మరో రెండు రోజుల తర్వా త సాయిగణేష్‌ను తిరిగి పాఠశాలకు పంపిస్తామని తల్లిదండ్రులు తెలిపారు.



ఘనంగా మహాలక్ష్మమ్మ జాతర



మహాలక్ష్మమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మహాలక్ష్మమ్మ జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునా యక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ అమ్మవారి ఆశీర్వాదం అందరిపై ఉండాలని, పాడిపంటలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బద్యానాయక్, మాజీ ఎంపీపీ సర్వయ్య, సిరాజ్‌ఖాన్, శ్రీను, పార్వతీచందునాయక్, పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మాడ్గులపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు బొమ్మకంటి నర్సింహ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం వెల్లదీస్తూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఇప్పటివరకు రైతులకు రైతుభరోసా అందించలేదని, రైతులు పొలాలను నాట్లు వేసుకుంటున్నా ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడ ుతున్నారని అన్నారు. హామీలను అమలు చేయకుండా విజ యోత్సవాల పేరుతో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జాన్‌రెడ్డి, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు వేదిక్ జ్యోతిష్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణానికి చెందిన సైంటిఫిక్ వాస్తు నిపుణులు, వాస్తురత్న అవార్డు గ్రహీ త మామిడి సత్యనారాయణ వేదిక్ జ్యోతిష్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఆధ్యాత్మిక, వాస్తు రంగాల్లో విశేష సేవలందిస్తున్న సత్యనారాయణకు ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ సంస్థ ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. సదస్సుకు హాజరైన జగద్గురు రామానుజాచార్య మహరాజ్, విద్యాభాస్కర్ జీ మహరాజ్(అయోధ్య) తో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. సదస్సుకు హాజరైన పీఠాధిపతుల ఆశీర్వాదం పొందడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు మామిడి తెలిపారు. కాగా ఉత్తమ అవార్డు అందుకున్న సత్యనారాయణకు పట్టణ ప్రముఖులు, వేద పండితులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం కప్ పోటీలకు ఆదిత్య విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, డిసెం బరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీలకు మిర్యాలగూడ పట్టణంలోని ఆదిత్య పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కర స్పాండెంట్ మారుతి అమరేంద ర్‌రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి ఖోఖో, వాలీబాల్ తదితర పోటీ లలో బాలికల విభాగంలో సౌమ్య, హప్సా, మానస, తీర్థ, మేఘన ఎంపిక కాగా బాలుర విభాగంలో సుశాంత్, నసీర్ బాబా, ఆవని, హేమంత్ ఎంపి కైనట్లు వివరించారు. ఎంపికైనట్లు విద్యార్థులను ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, కట్టా అనిత అభినందించారు.

అల్లం కిరణ్ టాలెంట్ పరీక్షలో పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివంగత సైంటిస్టు అల్లం కిరణ్ మెమోరియల్ టాలెంట్ పరీక్షలో బకాల్‌వాడీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి తెలిపారు. 'పేదరికానికి కారణాలు- పరిష్కారాలు' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొనగా వెన్నెల, అశ్విని, సుధీర్, మేఘన, అంజలి పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు సాధించడం ఆదర్శనీయమన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ కథా రచయిత అల్లం రాజయ్య బహుమతులు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

(5వపేజీ తరువాయి)

డిప్యుటేషన్‌పై పంపింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇళ్లు లేని పేదలకు ఇంటిని నిర్మించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆ శాఖను మళ్లీ పునరుద్ధరించింది. ప్రస్తుత గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో సర్వే సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టినా అవి అరకొరగా ఉండటంతో చాలా ప్రాంతాల్లో వాటిని లబ్ధిదారులకు కేటాయించని పరిస్థితి ఉంది. దీంతో అప్పట్లో ప్రభుత్వంపై విమర్శలు వెలువెత్తాయి. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే సకాలంలో పూర్తవుతుందా? లేక ఆటంకాలు ఎదురవుతాయా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పని ఒత్తిడి, సాంకేతిక సమస్యలతో సర్వే వేగవంతంగా ఎలా పూర్తవుతుందని సర్వేయర్లు ప్రశ్నిస్తున్నారు. కొద్ది రోజుల వరకు కుటుంబ సమగ్ర సర్వే నిర్వహించిన వారే మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులు చేస్తుండటంతో వారిపై పని భారం పడుతోంది. పలుచోట్ల యాప్‌లో వివరాలు నమోదు చేసిన సమయంలో సర్వర్ డౌన్ అవుతుండటంతో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య తలెత్తుతోంది.

సకాలంలో సర్వే పూర్తి చేస్తాం

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతంగా సాగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న అధికారులు, ఉద్యోగులు సర్వేను వేగవంతం చేశారు. ప్రస్తుతం 40వేల ఇళ్ల దరఖాస్తుల సర్వే పూర్తి చేసి 33వేల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తున్నాం.

-రాజ్‌కుమార్, గృహనిర్మాణ సంస్థ పీడీ